
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 194 | హైదరాబాద్ | శుక్రవారం 23-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00


11లో

మస్క్ తొలగించినా డీలాపడలేదు.. వేల కోట్ల కంపెనీకి అధిపతిగా పరాగ్!



11లో

## దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన ముఖ్యమంత్రి

- నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకున్న సీఎం
- పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని వెల్లడి
- గూగుల్, ఐబీఎం సీఈఓలు, లక్ష్మీ మిట్టల్ సహా 16 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం
- రేపు ఉదయం హైదరాబాద్‌కు చేరుకుని, అమరావతిలో విధుల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

## నాటికి ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్' గా గుర్తింపే లక్ష్యం: దావోస్‌లో మంత్రి లోకేశ్



- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకెళుతున్న ఏపీ
- 2035 నాటికి 'డే-జీరో రెడీ స్టేట్'గా మారడమే లక్ష్యం
- గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు అమలు చేసినట్టు వెల్లడి
- ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మంత్రి లోకేశ్

11లో




## మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు..

- తెలంగాణ టూరిజం, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్త నిర్వహణ
- హనుమకొండ నుంచి మేడారానికి, జాతరపై ఏరియల్ వ్యూ రైడ్స్
- రెండు రకాల సర్వీసులకు వేర్వేరు ధరలు ఖరారు

11లో

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. 10 మంది సైనికులు మృతి

- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు


11లో



11లో

## కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

- ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం పూర్తిగా చదవకుండానే వెళ్లిపోయిన గవర్నర్
- గవర్నర్ ను అడ్డుకుంటూ నిలదీసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- సరైన నిర్ణయం తీసుకున్నారంటూ గవర్నర్ కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు

## దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ.. రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

- పరస్పర సహకారంతో అభివృద్ధిపై ఇరు నేతల చర్చ
- ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించిన నారా లోకేశ్
- తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను చూడాలని లోకేష్‌కు రేవంత్ ఆహ్వానం
- మేడారం జాతరకు రావాలని లోకేష్‌ను ఆహ్వానించిన సీఎం


11లో




## గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్.. తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

- గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల రద్దుపై తీర్పు వాయిదా
- ఫిబ్రవరి 5న తీర్పును వెల్లడించనున్న తెలంగాణ హైకోర్టు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేసిన టీజీపీఎస్సీ, అభ్యర్థులు
- గతంలో నియామకాలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ధర్మాసనం
- తీర్పు వాయిదాతో అభ్యర్థుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

11లో

భారతశక్తి

# ఇక పెద్దన్న పాత్ర ముగింపేనా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో విసిగిపోయిన ఐరోపా సమాఖ్య దేశాలు, అమెరికా నాయకత్వంలోని ప్రపంచ వ్యవస్థకు ముగింపు పలికి ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాయి. బలవంతుల చట్టానికి లొంగిపోకూడదని, బెదిరింపులకు బదులు గౌరవాన్ని కోరుకుంటున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యూరప్ స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయం పెరిగిందని ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ తెలిపారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వైఖరి నాటో కూటమికి చేటుగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిపై విసిగిపోయిన మిత్రదేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అమెరికా నాయకత్వంలో నడిచే వ్యవస్థకు ముగింపు పలికినట్టు ప్రకటించాయి. యూరోపియన్ నాయకులు ఈ విషయంలో ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నారు. రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేశారని, ఇకపై ప్రపంచం ఆయనకు భయపడి నడుచుకునే రోజులు పోయాయని వారు భావిస్తున్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. 'బలవంతుల చట్టానికి' ఐరోపా సమాఖ్య లొంగిపోకూడదని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా ఈయూ తన 'యాంటీ-కోఎర్షన్ ఇన్‌స్ట్రుమెంట్' (వ్యాపారపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొనే సాధనం)ను ఉపయోగించాల్సి వస్తుందనేది పిచ్చి ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. 'మేము ఎక్కువ వృద్ధిని, ప్రపంచంలో ఎక్కువ స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం.. అంతేకాదు, బెదిరింపులకు బదులుగా గౌరవాన్ని కోరుకుంటాం. మేము క్రూరత్వానికి బదులుగా చట్టబద్ధతను కోరుకుంటాం' అని ట్రంప్ స్విట్జర్లాండ్‌కు చేరుకోవడానికి ముందు దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వార్షిక సమావేశంలో మెక్రాన్ అన్నారు. గాజా శాంతి బోర్డులో చేరడానికి ఫ్రాన్స్ నిరాకరించడంతో వారిపై 200 శాతం టారీఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించారుఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, ప్రపంచంలో వస్తున్న భారీ మార్పులకు ప్రతిస్పందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ మార్పుల వేగం, పరిమాణం యూరప్‌లో స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయాన్ని పెంచిందని ఆమె అన్నారు. 'నూతన స్వతంత్ర యూరప్‌ను నిర్మించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇది సమయం' అని ఆమె తన ప్రసంగంలో తెలిపారు.బెల్జియం ప్రధాన మంత్రి బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. 27 సభ్య దేశాల ఐరోపా సమాఖ్య ఒక కూడలిలో ఉందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా మద్దతు, ట్రంప్‌ను శాంతింపజేయడానికి ప్రయత్నించిన తర్వాత ఎదుర్కొన్న అతి దారుణమైన పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో నిర్ణయించుకోవాలని అన్నారు. 'సంతోషకరమైన సేవకుడిగా ఉండటం ఒక విషయం. దుర్భరమైన బానిసగా ఉండటం మరొకటి' అని ట్రంప్ సుంకాల బెదిరింపుల గురించి డి వెవర్ వ్యాఖ్యానించారు.'మీరు ఇప్పుడు వెనక్కి తగ్గితే, మీరు మీ గౌరవాన్ని కోల్పోతారు... కాబట్టి మనం ఏకం కావాలి, మీరు లక్ష్మణ రేఖలను దాటుతున్నారని ట్రంప్‌కి చెప్పాలి.. మనం కలిసి నిలబడతామా లేదా విడిపోతామా' అని ఆయన ఒక ప్యానెల్ చర్చలో అన్నారు.అమెరికా నేతృత్వంలోని ప్రపంచ పాలనా వ్యవస్థ 'ఒక విచ్ఛిన్నాన్ని' ఎదుర్కొంటుందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ మరింత సూటిగా వ్యాఖ్యానించారు. 'నేను స్పష్టంగా చెబుతున్నాను: మనం పరివర్తనలో కాదు, విచ్ఛిన్నంలో ఉన్నాం... అంతర్జాతీయ నియమాల-ఆధారిత క్రమం కథ పాక్షికంగా అబద్ధమని మాకు తెలుసు. బలవంతులు సౌకర్యవంతంగా ఉన్నప్పుడు తమను తాము మినహాయించుకుంటారు. వాణిజ్య నియమాలు అమలులో అసమానంగా వ్యవహరిస్తారు... అంతర్జాతీయ చట్టం నిందితుడి లేదా బాధితుడి గుర్తింపును బట్టి వేర్వేరు కఠినత్వంతో వర్తింపజేస్తారు' అని ఆయన అన్నారు.కెనడా ప్రధానిగా కార్నీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ట్రంప్ వ్యవహారశైలిపై పదేపదే హెచ్చరించారు. ట్రంప్ తన దావోస్ పర్యటనలో గ్రీన్‌లాండ్‌పై చర్చించడానికి నాటో సెక్రటరీ-జనరల్ మార్క్ రుట్టే, ఇతర పార్టీలతో సమావేశం కావాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కానీ, మంది సంబంధిత పార్టీలు ఈ సమావేశానికి హాజరుకాకపోవచ్చు. ట్రంప్‌ను కలవడం ఇష్టం లేక డెన్మార్క్ ప్రధాని దావోస్‌కు హాజరు కాలేదు. మెక్రాన్ కూడా అమెరికా అధినేతను కలవకుండానే స్విట్జర్లాండ్ నుంచి బయలుదేరారు. జర్మనీ, యూకే నేతలు కూడా కలిసే అవకాశం లేదు.గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం.. తాను సైన్యాన్ని ఉపయోగించి బలవంతం చేయబోనని.. ట్రంప్ తేల్చి చెప్పారు. కానీ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేందుకు తక్షణమే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌లాండ్ విక్రయానికి నిరాకరిస్తున్న డెన్మార్క్, ఐరోపా దేశాలపై ఆర్థిక ఆంక్షల హెచ్చరికలు జారీ చేశారు. గ్రీన్‌లాండ్ ఉత్తర అమెరికాలో భాగమని.. ప్రపంచ రక్షణ కోసం అది అమెరికాకు అవసరమని వాదించారు. ఈ పరిణామం అమెరికా-ఐరోపా దేశాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసింది.

# బస్సు యాత్రపై జగన్ కొత్త రాజకీయ వ్యూహం..

గుంటూరు, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:



వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయ వ్యూహంలో కీలక మార్పులు చేయబోతున్నారనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తానని, మరోసారి పాదయాత్ర చేపడతానని గత ఏడాది జులైలో జగన్ స్వయంగా ప్రకటించారు. అయితే తాజాగా ఆ నిర్ణయాన్ని ఆయన పునరాలోచన చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో 2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా జగన్‌కు భారీ విజయమే దక్కింది. కానీ ఈసారి అదే ఫార్ములాను కొనసాగించాలా? లేదా కొత్త మార్గం ఎంచుకోవాలా? అన్న అంశంపై ఆయన ఆలోచిస్తున్నట్లు టాక్ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే పాదయాత్ర ప్రారంభించడం వ్యూహపరంగా సరైనదా? అన్న ప్రశ్న వైసీపీలో చర్చకు వచ్చింది. ఒకవైపు పాదయాత్ర చేస్తే ప్రజల్లో నిరంతరం ఉండొచ్చు. మరోవైపు అంత సుదీర్ఘ కాలం అదే విధానంలో కొనసాగడం కష్టమేనని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్ తన ప్రణాళికను మార్చుకున్నారని సమాచారం. పాదయాత్రకు బదులుగా బస్సు యాత్ర చేపట్టి తక్కువ సమయంలోనే రాష్ట్రం అంతా పర్యటించాలని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు.వైసీపీ వర్గాల ప్రకారం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పూర్తిగా కొనసాగించడం లేదని ప్రజల్లో అసంతృప్తి ఉందని పార్టీ అంచనా వేస్తోంది. ఇలాంటి సమయంలో ప్రజల మధ్యకు వెళ్లడం వల్ల పార్టీకి మళ్లీ ఊపు వస్తుందని భావిస్తున్నారు. అయితే పాదయాత్ర లాంటి దీర్ఘకాలిక కార్యక్రమం కంటే, బస్సు యాత్ర ద్వారా ప్రతి జిల్లా, ప్రతి మారుమూల ప్రాంతాన్ని త్వరగా కవర్ చేయొచ్చన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు.ఈ ఏడాది మొత్తాన్ని బస్సు యాత్రకే కేటాయించి, గ్రామ స్థాయి వరకు వెళ్లాలని జగన్ భావిస్తున్నారని సమాచారం. ఇందుకోసం రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పార్టీ నేతలకు సూచనలు ఇచ్చినట్లు కథనాలు వస్తున్నాయి. నిజానికి ఈ ఏడాది ఆరంభంలోనే జిల్లాల పర్యటనలు ఉంటాయని వైసీపీ ప్రకటించింది. కానీ అధినేత పాదయాత్ర చేస్తానన్న ప్రకటనతో కార్యకర్తలు అదే ప్రధాన కార్యక్రమంగా భావించారు. ఇప్పుడు బస్సు యాత్ర ప్రతిపాదన తెరపైకి రావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ పెద్దగా ప్రజల్లోకి రాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆయన బెంగళూరు లో ఎక్కువ సమయం గడపడం, తాడేపల్లిలో ఉన్నప్పుడు ఎక్కువగా పత్రికా సమావేశాలకే పరిమితమవడం వల్ల పార్టీకి ఆశించిన లాభం దక్కలేదన్న అభిప్రాయం కూడా కార్యకర్తల్లో వినిపిస్తోంది. అయితే ప్రభుత్వం ఏర్పడి కేవలం 19 నెలలే కావడంతో కొంత సమయం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే జగన్ ఇప్పటివరకు వేచి చూశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైఎస్ జగన్ రాజకీయ ప్రస్థానంలో పాదయాత్రకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 2014 ఓటమి తర్వాత ఆయన చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' 2019లో ఆయనను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. దాదాపు 3,648 కిలోమీటర్ల మేర సాగిన ఆ యాత్ర అప్పట్లో జనంతో జగన్‌ను మమేకం చేసింది. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి, ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందడానికి మళ్లీ అదే మార్గాన్ని ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఎన్నికల ఫలితాల తర్వాత తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానని, ప్రతి నెలా జిల్లాల్లో పర్యటిస్తానని జగన్ ప్రకటించినప్పటికీ, గత ఏడాది కాలంగా ఆయన ఎక్కువగా తాడేపల్లి నివాసానికే పరిమితమయ్యారు. వారం వారం బెంగళూరు వెళ్లి వస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన సందర్భాలు తక్కువ. దీంతో ప్రత్యర్థుల నుంచి విమర్శలు రావడమే కాకుండా, పార్టీ కార్యకర్తలు కూడా కొంత డీలా పడ్డారు. ఇప్పుడు జగన్ స్వయంగా పాదయాత్ర ప్రకటన చేయడంతో, గ్రామస్థాయి నేతల్లో మళ్లీ కదలిక వస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వచ్చే ఏడాది పాదయాత్ర ప్రారంభించబోతున్న జగన్ ముందు కొన్ని కీలక సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టాల్సి ఉంటుంది. ఓటమితో నిరుత్సాహపడి ఇతర పార్టీల వైపు చూస్తున్న నేతలను ఆపి, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటామనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించడం ముఖ్యం.మొత్తానికి, జగన్ నిర్ణయం వైసీపీలో ఒక కొత్త ఆశను చిగురింపజేసింది. రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్ వరకు పాదయాత్ర వారి రాజకీయ విజయాలకు వెన్నెముకగా నిలిచింది. మరి 2027లో ప్రారంభం కాబోయే ఈ రెండో విడత మహా పాదయాత్ర జగన్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాలి.ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇక ఆలస్యం చేయకుండా జిల్లాల పర్యటనకు సిద్ధం కావాలని జగన్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బస్సు యాత్ర నిజమైతే, వైసీపీ రాజకీయాల్లో ఇది మరో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# దూకుడు పెంచిన ఈడీ

విజయవాడ, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:





ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక్కసారిగా దూకుడు పెంచడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గత రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు ఏదో జరగబోతోందన్న సంకేతాలు ఇస్తున్నాయి. మాజీ ఎంపీ విజయసాయిరెడ్, ప్రస్తుత ఎంపీ మిథున్ రెడ్డిలను ఈడీ వరుసగా విచారణకు పిలవడం ఈ కేసులో కీలక మలుపుగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డి జైలుకు వెళ్లి రాగా, విజయసాయిరెడ్డి మాత్రం తనను తాను విజిల్ బ్లోయర్ గా ప్రకటించుకుని అరెస్టు నుంచి తప్పించుకున్నారు. విజయసాయిరెడ్డి ఇటీవల పార్టీ అధినేత జగన్‌కు దూరం జరిగి.. రాజకీయాల నుంచి వైదొలిగారు. వైసీపీకి రాజీనామా చేశారు. సిట్ విచారణలో ఆయన కీలకంగా ఉన్నారని చాలా వివరాలు చెబుతున్నారన్న ప్రచారం ఉంది. నిందితుడిగా ఉన్నప్పటికీ ఆయనన ?సిట్ అరెస్టు చేయలేదు. తనను తాను విజిల్ బ్లోయర్ గా ప్రకటించుకున్నారు. అదే సమయంలో రాజకీయంగా సైలెంట్ గా లేరు. జగన్ చుట్టూ ఉన్న కోటరీపై బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. అంతర్గతంగా ఆయన సిట్ , ఈడీ అధికారులకు కీలక సమాచారం అందిస్తున్నట్లు వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. తనపై ఉన్న కేసుల నుంచి బయటపడేందుకు విజయసాయిరెడ్డి అప్రూవర్ గా మారుతున్నారని.. భావిస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకున్న వ్యక్తిగా విజయసాయిరెడ్డి ఇచ్చే స్టేట్‌మెంట్ ఈ కేసులో అత్యంత కీలకం కానుంది.ఇప్పటికే జైలు నుంచి బయటకు వచ్చిన మిథున్ రెడ్డిని ఈడీ మళ్ళీ విచారించడం వెనుక బలమైన ఆర్థిక లావాదేవీల ఆధారాలు ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపులు ఎక్కడికి వెళ్లాయి? ఎవరి ఖాతాల్లోకి చేరాయి? అన్న అంశాలపై ఈడీ ఆరా తీస్తోంది. విజయసాయిరెడ్డి సహకారం అందిస్తున్నందున ఆయన ఇచ్చిన సమాచారాన్ని మిథున్ రెడ్డి ముందు ఉంచి ఈడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ ఇద్దరు కీలక నేతల విచారణ పూర్తయిన తర్వాత, ఈ కేసు నేరుగా పార్టీ అత్యున్నత నాయకత్వం చుట్టూ ముసురుకునే అవకాశం ఉంది.ఒకవైపు విజయసాయిరెడ్డి తిరుగుబావుటా ఎగురవేయడం, మరోవైపు దర్యాప్తు సంస్థల వేగం పెరగడం జగన్ కోటరీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వీరిద్దరి విచారణ తర్వాత మరికొన్ని కీలక అరెస్టులు ఉండవచ్చని లేదా విదేశీ నిధులకు సంబంధించిన ఆధారాలు బయటపడవచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఏపీ లిక్కర్ స్కామ్ ఇప్పుడు కేవలం అవినీతి కేసుగా కాకుండా, వైసీపీ, జగన్ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే దిశగా సాగుతోందని ఆ పార్టీ వర్గాలు ఆందోళనతో ఉన్నాయి.

# విశాఖ ఉత్సవ్ కు భారీ ఏర్పాట్లు

విశాఖపట్టణం, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ఏడాది విశాఖ ఉత్సవ్ ను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. సాగరం నుంచి శిఖరం వరకు అనే ప్రత్యేక థీమ్‌తో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈసారి ఉత్సవాలను కేవలం విశాఖ నగరానికే పరిమితం చేయకుండా, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాలకు కూడా విస్తరించడం విశేషం. మూడు జిల్లాల వ్యాప్తంగా మొత్తం 20 ప్రధాన వేదికలపై 500కు పైగా సాంస్కృతిక, పర్యాటక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలో ప్రారంభ వేడుకలు ఘనంగా మొదలై, ఫిబ్రవరి 1న అనకాపల్లిలో ముగింపు వేడుకలతో ఈ సంబరాలు ముగుస్తాయి. తీరప్రాంత పర్యాటకం నుంచి మన్యం ప్రాంతపు గిరిజన సంస్కృతి వరకు ప్రతి అంశాన్ని ఈ వేదికలపై




ప్రదర్శించనున్నారు. ఈ మెగా ఈవెంట్ ద్వారా సుమారు రూ. 500 కోట్ల మేర ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, అలాగే సుమారు 3000 మంది స్థానిక కళాకారులు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆర్కే బీచ్‌తో పాటు రుషికొండ, సాగర్‌నగర్, భీమిలి బీచ్‌లలో డ్రోన్ షోలు, బీచ్ స్పోర్ట్స్, ఫ్లవర్ షో, మిస్ వైజాగ్ వంటి పోటీలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. అరకు, లంబసింగి వంటి ప్రాంతాలలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, హస్తకళల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫ్లవర్ షో , మిస్ వైజాగ్, మిస్టర్ వైజాగ్,వైజాగ్ కల్చర్ టాలెంట్స్, రాష్ట్ర సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, ఫుడ్ కోర్టులు, షాపింగ్ స్టాళ్లు. డ్రోన్ షో, బీచ్ గేమ్స్, బీచ్ రెస్టారెంట్, అడ్వంచర్ స్పోర్ట్స్, బోటు రేసింగ్, స్పీడ్ బోటింగ్, కయాకింగ్, పారామోటరింగ్, కార్నివాల్ వాక్, టెంపుల్ రెప్లిక, వంటల పోటీలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.అటవీ ప్రాంతంలో సైక్లింగ్ పోటీలు, ఫ్లోరీకల్చర్, అమ్యూజ్మెంట్ రైడ్స్, ఫుడ్ కోర్టులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ స్టాల్స్, కాఫీ ఫెస్టివల్, టాలీవుడ్ నటుల ప్రదర్శనలు, అరకు వ్యాలీ రైడ్స్, కార్నివాల్ వాక్, ట్రైబల్ పెర్ఫామెన్స్, అనంతగిరి, గాలికొండ ప్రాంతాల్లో ట్రెక్కింగ్ పారాగ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటరింగ్ వంటివి ఎర్పాటు చేస్తున్నారు.స్థానిక వంటకాలు , చేనేత వస్త్రాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల ప్రదర్శనకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

==============

# సార్..ఈ సారైనా అవకాశం ఇవ్వండి అధినేతకు వేడ్కోలు

కాకినాడ,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక అంతర్గత భేటీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన సమయంలో, పలువురు సీనియర్ నేతలు ఆయనను వ్యక్తిగతంగా కలిశారు. ఈ సమావేశాలు బయటకు సాధారణంగానే కనిపించినా, లోపల మాత్రం తీవ్రమైన ఆవేదన వ్యక్తమైందని సమాచారం."సర్? ఉద్యోగం వదిలేసి పార్టీ కోసం వచ్చాను. 25 ఏళ్లుగా సేవ చేస్తున్నా. నన్ను ఒక్కసారి గమనించండి" అంటూ ఒక నేత భావోద్వేగానికి లోనయ్యారు. మరో నేత "గత ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా టికెట్ త్యాగం చేశాను. ఇప్పుడు కూడా పట్టించుకోకపోతే నియోజకవర్గంలో తలెత్తుకోలేను" అని విన్నవించారు. ఇలా ఒక్కొక్కరు తమ సమస్యలను, త్యాగాలను చంద్రబాబు ముందు ఉంచారు. బయటికి చెప్పకపోయినా, లోపల వారి ఆకాంక్ష ఒక్కటే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆ ఆకాంక్ష..త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లు. మొత్తం నాలుగు సీట్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో, అందులో కనీసం రెండు సీట్లు టీడీపీకి దక్కే అవకాశం ఉందని అంచనా. ఈ రెండు సీట్ల కోసం పార్టీలో పోటీ తీవ్రంగా ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు ఈ రేసులో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.ఇదే సమయంలో ఒక ఎస్సీ నాయకుడు కూడా ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. గతంలో పోలీస్ ఉద్యోగాన్ని వదిలేసి టీడీపీలో చేరిన ఈ నేత, పార్టీ కోసం నిరంతరం పనిచేశారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అనుభవం ఉన్నప్పటికీ, ఈసారి అయినా తనకు న్యాయం చేయాలనే ఆకాంక్షతో చంద్రబాబును కలిసినట్లు తెలుస్తోంది.మరోవైపు, ఒక మాజీ మంత్రి తన డిమాండ్‌ను బలంగా వినిపించినప్పటికీ, బహిరంగంగా మాత్రం ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారని పార్టీలో చర్చ నడుస్తోంది. ఎవరు నేరుగా "నాకు రాజ్యసభ సీటు కావాలి" అని చెప్పకపోయినా, తమ సేవలు, త్యాగాలు, సామాజిక సమీకరణలు అన్నీ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని సమాచారం.ఈ భేటీలు జరిగిన రెండు రోజుల తర్వాతే ఈ వ్యవహారం బయటకు రావడం విశేషం. అప్పటివరకు ఎవరి భేటీ వారిదే అన్నట్టు నిశ్శబ్దంగా సాగింది. అయితే ఇప్పుడు ఈ రాజ్యసభ సీట్ల అంశం టీడీపీలో కొత్త చర్చకు తెరలేపింది. చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, సామాజిక సమతుల్యతకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు, పార్టీకి విధేయత చూపిన వారిని ఎలా ఆదరిస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో ఈ అంశం పార్టీ అంతర్గత రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# ఏపీ వైపే అంతర్జాతీయ సంస్థలు

విజయవాడ, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

దావోస్ ల ప్రపంచ పెట్టుబడుల సదస్సు జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమలతో పాటు సంస్థల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. అయితే ఈసారి ఇండియాలోని పలు రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులతో పాటు కీలక మంత్రులు వెళ్లారు. దాదాపు పదికి పైగా పెవీలియన్లు ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ ఒకే చోట ఉండడం విశేషం. మరోవైపు దక్షిణాది రాష్ట్రాల మధ్య పెట్టుబడుల కోసం ఆసక్తికర పోటీ నడుస్తోంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య పోటీ ఆరోగ్యకరంగా ఉంది. అయితే భారీ ఆఫర్ వచ్చింది. విశాఖలో లక్ష కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ఆర్ఎంజెడ్ సంస్థ ముందుకు రావడం హాట్ టాపిక్ అవుతుంది. అయితే పొరుగున ఉన్న తమిళనాడు వాసులు ఈ అవకాశం చేజారిపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు సంబంధించి ఓ ట్వీట్ వైరల్ అవుతోంది.ఆంధ్రప్రదేశ్ కు మరో భారీ పెట్టుబడి వచ్చింది. విశాఖలో ఆర్ఎంజెడ్ సంస్థ.. కాపులుప్పాడలో ఫేజ్ 1 ఐటీ పార్కులో జిసిసి పార్కు ఏర్పాటు చేయనుంది. ఆ సంస్థ ఎండి మనోజ్ మెండాతో మంత్రి నారా లోకేష్ చర్చలు జరిపారు. రాబోయే పదేళ్లలో దాదాపు పది మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే దక్షిణాది రాష్ట్రాలకు కాదని.. ఏపీకి పెట్టుబడులు రావడం పై.. చెన్నై అప్డేట్స్ పేరుతో ఉన్న ఓ ఎక్స్ అకౌంట్ నుంచి ఆసక్తికర ట్వీట్ చేశారు.' బెంగళూరు, హైదరాబాద్ లు చెన్నై ను వెనక్కి నెట్టినట్టేనా? కోయంబత్తూర్ ను విశాఖపట్నం వెనక్కి నెట్టేసింది. దీనికి కారణం ఆఫీసుల కోసం అవసరమైన స్థలం దొరకక పోవడమే. విశాఖపట్నం ఆర్ఎం జెడ్, సత్వా, రహేజా వంటి పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలను ఆకర్షించగలిగింది. కానీ మన తమిళనాడు ప్రభుత్వం చెన్నైలో కూడా ఈ కంపెనీలను తీసుకురాలేకపోయింది. మరో మంచి అవకాశం చేజారి పోతోంది' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ ట్వీట్ ఉంది. విశాఖకు ఆర్ఎం జెడ్ తరలి వెళ్లడం కోయంబత్తూర్ కు కోలుకోలేని దెబ్బ అని పరోక్షంగా ప్రస్తావించారు.మంత్రి నారా లోకేష్ ఆర్ఎంజెడ్ చైర్మన్ మనోజ్ మెండాతో చర్చలు జరిపారు. ఈ చర్చలు సక్సెస్ కావడంతో ఆ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశాఖలోని కాపులుప్పాడ ఫేస్ వన్ ఐటీ పార్కులో జిసిసి పార్క్ ఏర్పాటు చేయనుంది. 50 ఎకరాలలో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన హైపర్ స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. దశలవారీగా ఈ ప్రాజెక్టును కూడా చేపట్టనున్నారు. ఇందుకోసం 500 నుంచి 700 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు.రాయలసీమలో లాజిస్టిక్ పార్క్. రాయలసీమలో సైతం ఆర్ఎంజెడ్ గ్రూపు లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. టేకులోడు వద్ద సుమారు 1000 ఎకరాల్లో ఈ లాజిస్టిక్ పార్కు అభివృద్ధి చేయనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులను ప్రారంభిస్తే.. అందుబాటులోకి వస్తే లక్ష ఉద్యోగాలకు సంబంధించి మార్గం సుగమం కానుంది. మరోవైపు ఆర్ఎంజెడ్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన తరుణంలో.. మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు.కోయంబత్తూర్ లో ఆర్ఎం జెడ్ పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నా.. ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయలేకపోయిందనేది వీరి వాదన. కర్ణాటక నుంచి ఇటువంటి అభ్యంతరాలు వచ్చాయి. చాలామంది ఐటీ నిపుణులు, కంపెనీల నిర్వాహకులు ఇదే మాదిరిగా ట్వీట్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో తమిళనాడు రాజధాని చెన్నైకు రావాల్సిన కంపెనీలు హైదరాబాద్, బెంగళూరుకు తరలి వెళ్లాయి. ఇప్పుడు కోయంబత్తూర్ కు రావాల్సిన కంపెనీలు విశాఖకు వెళ్ళిపోతున్నాయి అనేది తమిళనాడు వాసుల ఆవేదన. కోయంబత్తూర్ కు రావాల్సిన కంపెనీలు విశాఖ వైపు



చూస్తున్నాయని వారు చెప్పుకొస్తున్నారు. కోయంబత్తూర్ అనేది టైర్ 2 నగరం. అదే స్థాయిలో ఉంది విశాఖపట్నం. అయినా సరే విశాఖకు పరిశ్రమలు వెళ్లిపోతుండడం వెనుక అక్కడి ప్రభుత్వం చూపుతున్న చొరవ కారణమని తమిళనాడు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఏపీ ప్రభుత్వ అనుకూల విధానాలతోనే కంపెనీలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నాయని వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఈ ఆసక్తికర ట్వీట్ వైరల్ అవుతోంది.

## రణ్ బీర్ కపూర్ చేతికి ఆర్సీబీ..

ముంబై, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో 10 జట్లు ఉన్నాయి. ఈ 10 జట్లకు అధిపతులుగా కేవలం కార్పొరేట్ దిగ్గజాలు మాత్రమే లేరు. బాలీవుడ్ స్టార్ నటులు కూడా ఐపీఎల్ లో ఆయా జట్లకు అధిపతులుగా కొనసాగుతున్నారు. కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుకు యజమానిగా షారుక్ ఖాన్ కొనసాగుతున్నాడు. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు సహజమానిగా ప్రీతి జింటా ఉంది. ఇప్పుడు ఈ జాబితాలో మరో బాలీవుడ్ స్టార్ నటుడు రన్బీర్ కపూర్ చేరిపోయాడు. కపూర్ బెంగళూరు జట్టులో దాదాపు 8 శాతం వాటా కొనుగోలు చేశారు. ఇందులో రెండు శాతం వాటాను దాదాపు 350 కోట్లు ఖర్చుపెట్టి కొనుగోలు చేశాడు. మిగతా 6% వాటాను స్టేక్ రూపంలో దక్కించుకున్నాడు. బెంగళూరు జట్టులో వాటాను కొనుగోలు చేయడం ద్వారా.. రన్బీర్ కపూర్ షారుక్ ఖాన్, ప్రీతి జింటా సరసన చేరాడు. బెంగళూరు జట్టు గత సీజన్లో విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. విజేతగా ఆవిర్భవించిన తర్వాత బెంగళూరు జట్టు విలువ అమాంతం పెరిగిపోయింది. బెంగళూరు జట్టును ప్రమోట్ చేస్తున్న కంపెనీ వాటాలను విక్రయించాలని నిర్ణయించుకుంది.గత సీజన్లో విజేతగా నిలిచిన తర్వాత బెంగళూరు జట్టు విలువ భారీగా పెరిగింది. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అనే సామెత తీరుగా బెంగళూరు యాజమాన్యం వ్యవహరించింది. అందువల్లే వాటాలను విక్రయించడం మొదలుపెట్టింది. రన్బీర్ కపూర్ కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా బెంగళూరు జట్టు అంటే మరింత ఇష్టం. పైగా ఇతడికి, విరాట్ కోహ్లీకి బలమైన సంబంధం ఉంది. అందువల్లే అతడు బెంగళూరు జట్టులో 8 శాతం వాటా కొనుగోలు చేశాడు. ఈ కొనుగోలు వెనక విరాట్ కోహ్లీ కూడా ఉన్నాడని ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ ఈ సీజన్లో బెంగళూరు జట్టు తరఫున రన్బీర్ కపూర్ ప్రచారం కూడా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.బెంగళూరు జట్టుకు మొదట్లో యజమానిగా విజయ్ మాల్యా వ్యవహరించాడు. కొన్ని సంవత్సరాల పాటు బెంగళూరు జట్టును విజయవంతంగా నడిపించాడు. ఆ తర్వాత ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులు వెలుగులోకి రావడంతో విజయ్ మాల్యా ఒక్కసారిగా బెంగళూరు జట్టుకు దూరం కావలసి వచ్చింది. ఇప్పుడు బెంగళూరు జట్టును ఓ విదేశీ కంపెనీ ప్రమోట్ చేస్తోంది. ఇప్పుడు ఆ జట్టు విలువ పెరిగిపోయిన నేపథ్యంలో వాటాలను విక్రయించడం మొదలుపెట్టింది. ఈ వాటాలలో 8 శాతాన్ని రన్బీర్ కపూర్ కొనుగోలు చేయడం విశేషం.

## ఆహార నాణ్యతలో తేడా వస్తే వేటు తప్పదు

ములుగు ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

తెలంగాణ కుంభమేళా గా పేరొందిన ములుగు జిల్లా మేడారం జాతర విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి అందిస్తున్న భోజన ఏర్పాట్లను గురువారం మేడారంలో పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మెస్ ను ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ స్వయంగా పరిశీలించారు. మెస్ లో భోజన నాణ్యతను పరిశీలించి, అన్ని ర్యాంకుల అధికారులు, సిబ్బంది తో పాటు పారిశుధ్య కార్మికులకు కూడా సమానమైన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు.భోజనం పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా తీసుకునే ఆహారమే బందోబస్తు విధుల్లో ఉన్న ప్రతి సిబ్బందికి అందించాలని ఆహార విభాగం ఇన్చార్జ్ అధికారులను ఆదేశించారు.బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యం, భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డి శివమ్ ఉపాధ్యాయ,ఏఎస్పి ఏటూరునాగారం మనన్ భట్,ఎస్పి సిబి శంకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముంబై తరహాలో విశాఖ...




విశాఖపట్నం,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

సాగరతీరం విశాఖపట్నం అభివృద్ధి మీద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా ముంబై తరహాలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఏపీ నుంచి అధికారుల బృందం ముంబైలో పర్యటించింది. సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విధానాలను అధ్యయనం చేసింది. ఆ విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నం రూపురేఖలు త్వరలోనే మారిపోనున్నాయి. ముంబై తరహాలో విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన నేషనల్ గ్రోత్ హబ్‌లో భాగంగా, విశాఖపట్నాన్ని గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం ముంబైలో విజయవంతమైన సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహా విధానాలను ఏపీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.మరోవైపు విశాఖ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద.. కైలాసగిరి, భీమిలి మధ్య బే సిటీని అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ సూచించింది. విశాఖపట్నం 2.0ను భోగాపురం విమానాశ్రయం వరకు విస్తరించాలని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ ఏరోసిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లడానికి.. ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం జనవరి 12, 13 తేదీలలో పట్టణ అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేయడానికి ముంబైని సందర్శించింది. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ల్యాండ్ మానిటైజేషన్, ఈఓపి ప్రీమియం ద్వారా నిధులు ఎలా సమకూర్చుకోవాలో వీరు అధ్యయనం చేశారు.ఈ సందర్భంలో భాగంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆర్థికంగా స్వయం సమృద్ధిని ఎలా సాధించాయనే దానిపై అధ్యయనం జరిపారు. అలాగే ప్రతిపాదిత భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ 2.0 ప్రాజెక్టులకు బెంచ్‌మార్క్‌లుగా నవీ ముంబై, (నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ నోటిఫైడ్ ఏరియా) నమూనాలను అధ్యయనం చేశారు. మరోవైపు ప్రస్తుతం దాదాపు రూ. 14,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పనిచేస్తుంది, ఎక్కువగా భూమి, రియల్ ఎస్టేట్ ఆధారిత ఆదాయం ద్వారా నిధులు సమకూరుస్తుంది.మరోవైపు నీతి ఆయోగ్ ఇటీవల డెవలపింగ్ విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ యాజ్ గ్లోబల్ ఎకనమిక్ హబ్ అనే పేరుతో నివేదికను విడుదల చేసింది, ఈ ఎకనమిక్ రీజియన్.. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు తొమ్మిది జిల్లాలను కవర్ చేస్తుంది. నీతి ఆయోగ్ నేషనల్ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ఎంపిక చేశారు. మరోవైపు ముంబై నుంచి నేర్చుకున్న వాటి ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ల్యాండ్ వాల్యూ క్యాప్చర్, ల్యాండ్ మానిటైజేషన్ పాలసీలను అనుసరించనుంది.ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్ వైజాగ్ 2.0 ఆలోచన చేస్తున్నారు. దక్షిణాన విశాఖపట్నం ఓడరేవు నుంచి ఉత్తరాన భోగాపురం విమానాశ్రయం వరకు 200–250 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఆలోచన చేస్తున్నారు. అలాగే వైజాగ్ బే సిటీని 40 చదరపు కిలోమీటర్ల ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా ప్రతిపాదించారు. కైలాసగిరి, భీమిలి మధ్య 25 కి.మీ తీరప్రాంతాన్ని వాటర్‌ఫ్రంట్ నగరంగా మార్చాలని ఆలోచనలు చేస్తున్నారు.మరోవైపు మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలోని ఐటీ, డేటా సెంటర్ హబ్‌లు, భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ బే సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా విశాఖ రూపురేఖలు మారుతాయని భావిస్తున్నారు

## టీడీపీ గూటికి పిల్లి...

రాజమండ్రి, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్వార్టీ మారే ఆలోచనతో ఉన్నారా? టిడిపిలో చేరుతారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారా? అందుకే సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తున్నారా? త్వరలో ఆయన ఎందుకు చంద్రబాబును కలవనున్నారు? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. నిన్నటికి నిన్న ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో వైసిపి హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. గృహ నిర్మాణంలో భాగంగా కోట్లాది రూపాయలు అప్పట్లో పక్కదారి పట్టించారని ఆరోపణలు చేశారు. మరో నాలుగు నెలలు రాజ్యసభ పదవీకాలం ముగియడం, సొంత పార్టీ నేతలపై బోస్ ఆరోపణలు చేయడంతో.. ఆయన పార్టీ మారుతారని ప్రచారం మొదలైంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు తర్వాత జగన్ వెంట అడుగులు వేశారు సుభాష్ చంద్రబోస్. 2014 ఎన్నికల్లో ఓటమి చవి చూశారు. 2019 ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ విషయంలో ప్రయోగం చేశారు జగన్. ఆయన సొంత నియోజకవర్గాన్ని కాదని మండపేట టికెట్ ఇచ్చారు. రామచంద్రపురం నుంచి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రంగంలోకి దించారు. అయితే రామచంద్రపురం నుంచి వేణుగోపాలకృష్ణ గెలిచారు. మండపేట నుంచి సుభాష్ చంద్రబోస్ ఓడిపోయారు. అయితే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు జగన్ బోస్ కు. అలా ఎమ్మెల్సీగా ఉన్న బోస్ ను మంత్రిని కూడా చేశారు. అయితే ఇంతలో మండలిని రద్దు చేయాలని ఆలోచన చేశారు. ఈ క్రమంలోనే బోస్ను రాజ్యసభకు పంపించారు. ఆయన



రాజీనామా చేసిన మంత్రి పదవిని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు ఇచ్చారు. అయితే ఎంపీగా ఉన్న బోస్ కు, మంత్రిగా ఉన్న వేణుగోపాల కృష్ణ మధ్య విభేదాలు నడిచాయి.రాజ్యసభ సభ్యుడిగా ఉండడంతో సుభాష్ చంద్రబోస్ కు మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం చిక్కలేదు. పైగా రామచంద్రపురం నియోజకవర్గ బాధ్యతల విషయంలో ఆయన అసంతృప్తితో ఉన్నారు. మరో ఆరు నెలల్లో రాజ్యసభ పదవి కూడా ఖాళీ కానుంది. ఇప్పుడు ఏదో ఒక పొలిటికల్ ప్లాట్‌ఫారం కావాలి. అందుకే పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇప్పుడు సౌండ్ చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గృహ నిర్మాణ అవినీతి ఆయనకు గుర్తుకు రాలేదు. ఇప్పుడు అదే అంశాన్ని పట్టుకొని సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబును కలుస్తానని చెబుతున్నారు. తద్వారా టిడిపిలో ఎంట్రీ కి సిద్ధమని సంకేతాలు పంపిస్తున్నారు. మరి తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో చూడాలి. అటు వైసీపీ నాయకత్వం సైతం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## అమరావతిలో తొలిసారి రిపబ్లిక్ డే వేడుకలు

విజయవాడ, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఏపీ రాజధాని గా అమరావతి ని ప్రకటించి పదేళ్లు దాటిపోయింది. ఇంతవరకూ ఇండిపెండెన్స్ డే గానీ రిపబ్లిక్ డే కానీ ఇక్కడ జరుపలేదు. రెండోసారి కూటమి అధికారం లోకి వచ్చాక అమరావతి లో ఆగస్టు 15, జనవరి 26 వంటి వేడుకలను జరుపాలని ట్రై చేసినా అక్కడ రోడ్లు, సరైన గ్రౌండ్ ఏర్పడక పోవడం తో సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ యాంగిల్ లో కూడా ఆలోచించి ఇంతవరకూ అలాంటి నిర్ణయం తీసుకోలేదు ప్రభుత్వం. అయితే ఇప్పుడు ఆ సమస్య చాలా వరకూ తీరిపోవడం తో సీడ్ యాక్సిస్ రోడ్డు ను సమీపంలో రిపబ్లిక్ డే కోసం ఒక గ్రౌండ్ ని రెడీ చేశారు.అమరావతి లో క్రొత్తగా నిర్మించిన ఎమ్ ఎ ల ఫ్లాట్స్,, ఓ.ఎం అపార్టుమెంట్ ల మధ్యలో సీడ్ యాక్సిస్ రోడ్డు నుండి ఏపీ హై కోర్ట్ కు వెళ్లే రోడ్డు లో 22 ఎకరాల గ్రౌండ్ ని రిపబ్లిక్ డే పెరేడ్ కోసం ఎంపిక చేశారు. గత కొన్ని రోజులుగా ఆ గ్రౌండ్ ని చదును చేసి టెంట్స్ వేసి పెరేడ్ కి అనుకూలంగా బాట వేసారు. ఇప్పటికే ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం పోలీసులు, స్కౌట్స్, ఎన్‌సిసి కేడెట్స్ రిపబ్లిక్ డే డ్రిల్ రిహర్సల్ చేస్తున్నారు. జనవరి 26 వ తేదీన రాష్ట్రాన్ని ఉద్దేశించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించే వేదిక కూడా రెడీ అయిపోయింది.రిపబ్లిక్ డే అంటే గుర్తు వచ్చేది వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు. ఈసారి దాదాపు 30 శకటాలు ఏపీ రిపబ్లిక్ డే లో పాల్గొన బోతున్నాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు " స్వర్ణ ఆంధ్ర మిషన్ 2047 " కోసం ప్రవేశ పెట్టిన 10 సూత్రాలను ప్రతిబింబించేలా ఈ శకటాలు తయారీ ని పర్యవేక్షిస్తోంది ఏపీ సమాచార శాఖ. పేదరిక నిర్మూలన,ఉద్యోగ కల్పనకు నైపుణ్య అభివృద్ధి, నీటి భద్రత, అగ్రికల్చర్ ఆగ్రిటెక్ వంటి 10 అంశాలతో శకటాలు ఈ రిపబ్లిక్ డే కి స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. 26.01.26 తేదీ నుండి రిపబ్లిక్ డే, ఆగస్టు 15 వంటి కార్యక్రమాలు అన్నీ ఇకపై అమరావతి లోనే జరుగబోతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. దీనితో ఇన్నాళ్ళు ఇలాంటి వేడుకలకు వేదిక అయిన విజయవాడ లోని ఇందిరాగాంధీ స్టేడియం ఇకపై ఆ రకం కళను కోల్పోనుందిఅయితే ఏపీ రాజధాని అమరావతి లోనే ఇకపై రిపబ్లిక్ డే, ఆగస్టు 15 వంటి వేడుకలు జరుగుతుండడం తమకు ఎంతో గర్వకారణం గా ఉందని అమరావతి రైతులు చెబుతున్నారు. ఈ రిపబ్లిక్ వేడుకల నేపథ్యంలో అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు లో భద్రతను పెంచారు.

==============

## ప్రైవేట్ బస్సులో మంటలు ప్రయాణికులు సురక్షితం

పాలకొల్లు,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

స్థానికుల అప్రమత్తతతో బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. సంబంధిత వివరాలకు వెళితే పాలకొల్లు నుండి హైదరాబాద్ కు కావేరీ ట్రావెల్స్ పేరుతో ఉన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బుధవారం అర్ధరాత్రి బయలుదేరింది బయలుదేరిన కొంతసేపటికి బస్సు రేర్ ఇంజన్లో మంటలు చెల రేగడంతో స్థానికులు గుర్తించి వెంటనే డ్రైవర్ ను అప్రమత్తం చేశారు. కంగారు పడ్డ ప్రయాణికులు బస్సు నుండి దిగి భయంతో వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న రవాణా శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని బస్సులో ప్రయాణికులను మరొక బస్సులో ఎక్కించారు. ఏసి కంప్రెసర్ వద్ద బెల్టు తెగి షార్ట్ సర్క్యూట్ తో మంటలు వచ్చాయని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ప్రమాదం ఏమి జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# మహారాష్ట్రలో పవర్ పాలిటిక్స్..

ముంబై,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

మున్సిపల్ ఎన్నికల వేళ మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల అంబర్‌నాథ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులైన కాంగ్రెస్-బీజేపీలు చేతులు కలిపాయి. తాజాగా, కళ్యాణ్-దొంబివ్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే శివసేన, రాజ్‌ఠాక్రే నేతృత్వంలోని ఎంఎన్ఎస్ కూటమిగా ఏర్పడ్డాయి. బీఎంసీ ఎన్నికల కోసం ఠాక్రే సోదరులు విబేధాలను వీడి రెండు దశాబ్దాల తర్వాత చేతులు కలపడం, ఇప్పుడు షిండే సేన-ఎంఎన్ఎస్ పొత్తు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మున్సిపల్ ఎన్నికల వేళ మహారాష్ట్ర రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి.అంబర్‌నాథ్ కార్పొరేషన్ మేయర్ పీఠం కోసం కాంగ్రెస్‌తో బీజేపీ జట్టుకట్టియావత్తు దేశాన్ని విస్మయానికి గురిచేసింది. తాజాగా, కళ్యాణ్ దొంబివిలీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే శివసేన.. రాజ్‌ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనతో కూటమిగా ఏర్పడి మరో షాకిచ్చింది. ఠాక్రే సోదరులు విబేధాలను పక్కనబెట్టి బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల కోసం 20 ఏళ్ల తర్వాత చేతులు కలిపిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. బీఎంసీ ఎన్నికల్లో బీజేపీ-షిండే సేన కూటమి మెజార్టీ స్థానాలు గెలిచినప్పటికీ.. మేయర్ పదవి కోసం ఈ రెండు మిత్రపక్షాల మధ్య తీవ్ర పోరు జరుగుతోంది.ఇక, మొత్తం 107 వార్డులున్న కళ్యాణ్-దొంబవ్లీ కార్పొరేషన్‌లో షిండే సేన 53, బీజేపీ 50 స్థానాల్లో గెలుపొందాయి. ఈ రెండూ కలిస్తే సాధారణ మెజార్టీ 62 కంటే అత్యధికం. కానీ, రెండు పార్టీలు మేయర్ పీఠం కోసం పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఎన్ఎస్ ఐదు సీట్లను గెలుచుకోగా.. షిండే సేన ఆ పార్టీతో పొత్తుపెట్టుకుంటే వారి బలం 58కు చేరుతుంది. మెజార్టీకి మరో నాలుగు తక్కువ అవుతాయి. ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే, నరేష్ మహాస్కేలు.. ఎంఎన్ఎస్ నేత రాజు పాటిల్‌తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.బీజేపీ, షిండే సేన కూటమికి మద్దతుగా ఎంఎన్ఎస్ నిలవడంతో మహాయుతిలో చీలిక వస్తుందన్న వార్తలను మహస్కే కొట్టిపారేశారు. అభివృద్ధి కోసమే ఈ పొత్తు అని, ఎంఎన్ఎస్‌ను స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 50, షిండే సేన 53, ఎంఎన్ఎస్ 5, శివసేన (యూబీటీ) 11, ఎన్సీపీ (ఎస్పీ) ఒకటి, కాంగ్రెస్ రెండు స్థానాలు గెలుచుకున్నాయి.రాజు పాటిల్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థలో స్థిరత్వం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బీజేపీ, శివసేన కలిసి పోటీ చేస్తున్నందున, వారికి మద్దతు ఇవ్వడం సహజమని ఆయన అన్నారు. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని రూపొందిస్తామని కూడా ఆయన తెలిపారు. ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే , ప్రాంతీయ రాజకీయ పరిస్థితుల ఆధారంగా స్థానిక నాయకత్వానికి స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అధికారం ఇచ్చారని పాటిల్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ వ్యూహాత్మక మద్దతు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.ఎంఎన్ఎస్ పదవుల కోసం బేరసారాలు ఆడటం లేదని, కార్పొరేషన్‌ను స్తంభింపజేస్తున్న నిరంతర ఆధిపత్య పోరును అంతం చేయడమే తమ లక్ష్యమని పాటిల్ స్పష్టం చేశారు. షిండే వర్గానికి మద్దతు ఇవ్వడం ద్వారా, స్థానిక ప్రభుత్వ సమగ్రతను కాపాడే క్రియాశీల పరిపాలనను సృష్టించాలని ఎంఎన్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది.

# నట్టేటా మునిగిన ఇరాన్

టెహ్రాన్,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఇరాన్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తర్జన భర్జన వైఖరి ప్రపంచాన్నే కాకుండా, అక్కడి ప్రజల్ని కూడా అయోమయంలోకి నెట్టింది. ఒక వైపు కఠిన సైనిక చర్యలకు సిద్ధమన్న సందేశాలు, మరో వైపు చర్చలు, ఒప్పందాల మాటలు, మధ్య మధ్యలో ఇరాన్ పరిపాలనను పొగడ్తలతో ప్రస్తావించిన ఆయన సోషల్ మీడియా పోస్టులు నిరసనకారుల్లో గందరగోళాన్ని సృష్టించాయి. దీంతో, ఇరాన్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని ట్రంప్ నిజంగా ఎంతవరకు అంచనా వేశాడనే ప్రశ్న చర్చనీయాంశమైంది.మతాధారిత పాలనపై సంవత్సరాలుగా పేరుకుపోయిన అసంతృప్తి ఒకవైపు.. ఇంకోవైపు పెరిగిన ఆర్థిక ఇబ్బందులు కారణంగా సామాజిక మాధ్యమాల పిలుపుతో రాజధాని టెహ్రాన్‌తోపాటు పెద్ద పట్టణాల్లో డిసెంబర్ చివరి వారంలో భారీ నిరసనలు చెలరేగాయి. అదే సమయంలో వెనెజులాలో అమెరికా సైనిక జోక్యంతో అక్కడి అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేశారనే వార్తలతో, ఇరాన్ ప్రజల్లో కూడా "మాకు కూడా అమెరికా సహాయం చేస్తుందేమో'' అనే ఊహాగానాలు బలపడ్డాయి.నిరసనలకు మద్దతుగా ట్రంప్ వరుస ట్వీట్లు ఉద్యమానికి ఊపిరి పోశాయి. 'సహాయం చేస్తాం.. నిరసన కొనసాగించండి', 'లాక్డ్ అండ్ లోడెడ్" వంటి పదజాలం అక్కడి ఉద్యమకారులకు ధైర్యం నింపింది. వేలాది మంది వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు పెట్టారు. నిరసనలు ఉధృతం అవుతుండగా, ఇరాన్ ప్రభుత్వం పాత పద్ధతినే అనుసరించింది. ఇంటర్నెట్ సేవలు నిలిపివేత, భద్రతా బలగాల విస్తృత మోహరింపు, కాల్పులు, అరెస్టులు. స్నైపర్ దాడులు, మెషిన్ గన్ కాల్పులు, వందలాది మరణాల నేపథ్యంలో ప్రజల్లో 'ఇప్పుడు అయినా అమెరికా ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటుంది అనే నమ్మకం మరింత బలపడిందిమరోవైపు అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ నుంచి ఇరాన్‌పై వైమానిక దాడుల కోసం యుద్ధ విమానాలు సిద్ధంగా ఉన్నాయనే ప్రచారం ప్రపంచ మీడియాలో వినిపించింది. దీంతో "ఏ క్షణమైనా అమెరికా యుద్ధం మొదలెడుతుందేమో" అనే అంచనాతో ఇరాన్ నిరసనకారులంతా ఆకాశంవైపు ఎదురు చూశారు. కానీ, ట్రంప్ ఆకస్మికంగా స్వరం మార్చాడు. ఇరాన్ పాలకులు నిరసనకారుల ఉరి శిక్షలు నిలిపివేస్తామని హామీ ఇచ్చారని, అందుకే కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ప్రకటిస్తూ, సైనిక చర్య ఉండదనే సంకేతాన్నిచ్చాడు. ఈ ప్రకటన అక్కడి ప్రజల్ని తీవ్ర నిరాశలోకి నెట్టింది.ట్రంప్ వ్యాఖ్యలను పట్టుకుని కొందరు ఇరాన్ అధికారులు నిరసనలను ఎగతాళి చేయడం మొదలుపెట్టారు. నిరసనల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భయంతో చాలా మంది వెనక్కి తగ్గగా, ప్రస్తుతానికి అక్కడ ఆందోళనలు గణనీయంగా తగ్గిపోయాయి. మళ్లీ అదే స్థాయిలో నిరసనలు చెలరేగుతాయా లేదా అనేది అనిశ్చితంగా మారింది. ట్రంప్ వైఖరిపై ఇరాన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసనల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు, ఆ రక్తానికి ట్రంప్ కూడా భాగస్వామే. ఆయన పిలుపునే నమ్మి తాము వీధుల్లోకి వచ్చామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ మమ్మల్ని బలిపశువులుగా వాడుకున్నాడు అని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొందరు విశ్లేషకులు ట్రంప్ వెనకడుగు కూడా ఒక వ్యూహమేనని అభిప్రాయపడుతున్నారు. ముందుగా ఇరాన్ ప్రభుత్వ నమ్మకం గెలుచుకుని, తర్వాత మరో దెబ్బతో కుదుపు ఇస్తాడనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, నిరసనల్లో రక్తం చిందించిన సాధారణ ప్రజలు ఇప్పటి వరకు జరిగినదంతా తమ ఆశలు, ప్రాణాలు, భవిష్యత్తు రాజకీయ లెక్కల్లో బలితీసుకుపోయిన చేదు అనుభవంగానే మిగిలిపోయింది.

# గులాబీ పార్టీలో సిట్ లీక్స్ కలకలం...

హైదరాబాద్, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న విషయాలు, సిట్ లీక్స్ ప్రచారం తారా స్థాయికి చేరుతున్నాయి. తాజా?గా ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ఆ ఎనిమిది గంటల విచారణ ముగిశాక మీడియా సమావేశంలో సిట్ అధికారులపై మాజీ మంత్రి ,బీఆర్ ఎస్ కీలకనేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హరీష్ మాట్లడిన కొద్దిసేపటికే సిట్ పత్రికా ప్రకటన పేరుతో అవాస్తవాలు నమ్మొద్దంటూ సజ్జనార్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇలా ఒక్క విచారణ వంద అనుమానాలు,మరెన్నో ప్రశ్నలు అన్నట్లుగా హరీష్ రావు విచారణ ముగిసింది. ఇదిలా ఉంటే తాజాగా సిట్ లీక్స్ తీవ్ర దుమారం రేపుతున్నాయి. సిట్ విచారణ సందర్భంగా హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు, సిట్ వివరణలకు సంబంధం లేకుండా సరికొత్త వివాదం తెరపైకి తెచ్చాయి సిట్ లీక్స్. ఈ లీకులు ఎవరు చేశారు. ఎందుకు చేశారు. వాస్తవాలేంటి అనే సందేహి?లు కాసేపు ప్రక్కన పెడితే. ఇంతకీ ఆ లీకుల్లో చెప్పిన విషయాలు కారు పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నాయి.సిట్ విచారణ సందర్భంగా నిన్న హరీ?ష్ రావు ఫోన్ ట్యాప్ అయ్యిందనే విషయాన్ని సిట్ అధికారులు హరీష్ రావుకు చెప్పడంతో ఆయన ఒక్కసారిగా షాక్ అయ్యారట. మా ప్రభుత్వంలో నా ఫోన్ ట్యాప్ అవ్వడమేంటి అంటూ సిట్ అధికారుల ముందు ఆశ్చర్యం వ్యక్తం చేశారట. 2018 అసెంబ్లీ ఎన్నికల తరువాత నుండి కొన్ని నెలలపాటు హరీష్ రావు ఫోన్ ట్యాప్ అయినట్లు చెప్పారట. ఎప్పుడైతే తన ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారో అప్పటి నుండి అధికారులు అడుగుతున్న ప్రతీ ప్రశ్నను పేపర్ పై రాసుకున్నారట హరీష్ రావు. నా ఫోన్ ట్యాప్ అయినట్లు మీరే కావాలని సృష్టిస్తున్నారా అంటూ సిట్ అధికారులను హరీష్ రావు తిరిగి ప్రశ్నించారట. ఏ రోజు, ఏ టైమ్ లో తన ఫోన్ ట్యాప్ అయ్యిందో ఆధారాలతో సహా హరీష్ రావుకు వివరించిన అధికారులు, మీకు తప్పుడు సమాచారం చెప్పాల్సిన అవసరం మాకు లేదంటూ సమాధనామిచ్చారట. ఒక్క హరీష్ రావు ఫోన్ మాత్రమే కాదు,తన అనుచరుల ఫోన్లు కూడా గత ప్రభుత్వంలో ట్యాప్ చేసినట్లుగా సిట్ అధికారులు హరీష్ రావుకు ఆధారాలతో సహా వివరించినట్లుగా సిట్ లిక్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.సిట్ లీక్స్ లో హరీష్ రావు ఫోన్ ట్యాప్ అయిన విషయం బయటకు రావడంతో సొంత పార్టీలో? తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బీఆర్ ఎస్ పార్టీలో కేసీఆర్ తరువాత పార్టీని అన్నీ తామై నడిపించింది కేటీఆర్ ,హరీష్ రావు అనే విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు హరీష్ రావు ఫోన్ ట్యాప్ చేయాల్సిన అవసరం ఎవరొకొచ్చింది. హరీష్ రావు సీక్రెట్ సంభాషణలు వినాలని ఎవరనుకున్నారు. పార్టీలో? తనకు తెలియకుండానే హరీష్ పై కన్నేసిన వ్యక్తి ఎవరు అనేది గులాబీ దళంలో ప్రకపంనలు రేపుతోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుడిగా హరీష్ మారాడంటే, పార్టీలో అంతలా ప్రభావితం చేసిన కీలక నేతపైనే చర్చనడుస్తోంది. ఈ లీకులు కేటీఆర్ , హరీష్ రావు మధ్య గ్యాప్ కు కారణమతాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.ఇంతకీ ఈ సిట్ లీక్స్ బీఆర్ ఎస్ లో కేటీఆర్ , హరీష్ రావు మధ్య చిచ్చు పెట్టడం ద్వారా పార్టీకి హరీష్ ను దూరం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారా , లేక హరీష్ రావు ఫోన్ ట్యాప్ జరిగిందా అనే విషయాలు సిట్ అధికారులే నిర్ధారించాల్సి ఉంది.

## సూర్యాపేటలో తొలిసారి బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

సూర్యాపేట ,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

సూర్యాపేట జిల్లా పోలీసులు తొలిసారి బాధితుల ఇంటి వద్ద తొలి ఎఫ్ఐఆర్ ను నమోదు చేసారు. నడిగూడెం పోలీసులు ఇంటి వద్దే ఎకఫ్ఐఆర్ నమోదు చేసారు. బాధితుల ఫిర్యాదుపై ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కార్యాచరణ అమలు చేయడంలో భాగంగా నడిగూడెం పోలీసులు జిల్లాలో మొదటి కేసు నమోదు చేసినారని ఎస్పీ నరసింహ తెలిపారు. నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామానికి చెందిన వికాళాంగురాలు భూమా రమాదేవిని భర్త వేధిస్తున్నాడు, కొడుతున్నాడు అని డయల్ 100 కు ఫోన్ చేయగా సంచారం అందుకున్న నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని బాదితురాలికి అందించారని అన్నారు. ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్× కార్యక్రమం ద్వారా మహిళలపై, పిల్లలపై, వృద్ధులపై దాడులు, దొంగతనాల, భౌతిక దాడులు, బాల్య వివాహాలు, వేదింపులు వట్టి సందర్భాల్లో బాధితులకు భరోసాగా ఉంటుంది, ఇంటికి వెళ్లి కేసు నమోదు చేయడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు. మొదటి కేసు నమోదు చేసిన నడిగూడెం పోలీసులను ఈ సందర్భంగా అభినందించారు.

# వరంగల్‌లో ఉమెన్ కమాండో ఫోర్స్ రుద్రమ

వరంగల్,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

వరంగల్‌లో మహిళా శక్తికి ప్రతీకగా 'రుద్రమ' కమాండో బృందం సిద్ధమైంది. తెలంగాణలోనే తొలిసారిగా రూపుదిద్దుకున్న ఈ ప్రత్యేక దళం, కఠిన శిక్షణతో శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా తయారైంది. ఉన్నత విద్యావంతులు, క్రీడాకారులతో కూడిన ఈ బృందం.. ఆయుధ శిక్షణతో పాటు ఆత్మరక్షణలోనూ రాణిస్తోంది. అల్లర్లు, బందోబస్తు, కూంబింగ్ ఆపరేషన్లలో వీరు కీలక పాత్ర పోషించనున్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళా శక్తికి నిదర్శనంగా, రాణి రుద్రమదేవి వీరత్వాన్ని పుణికిపుచ్చుకున్నట్లుగా 'రుద్రమ' మహిళా పోలీస్ కమాండో బృందం రణక్షేత్రంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వినూత్న ఆలోచనతో.. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా వరంగల్‌లో ఈ ఉమెన్స్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ రూపుదిద్దుకుంది. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా ఈ బృందానికి కఠిన శిక్షణ ఇచ్చారు.ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళా కానిస్టేబుళ్లలో అత్యంత ప్రతిభావంతులైన 21 మందిని ఈ ప్రత్యేక విభాగం కోసం ఎంపిక చేశారు. ఈ టీంలో కేవలం శారీరక ధృఢత్వమే కాకుండా, మేధోపరమైన సత్తా ఉన్న వారు కూడా ఉన్నారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి క్రీడల్లో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వారితో పాటు ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంబీఏ వంటి ఉన్నత విద్యావంతులు కూడా 'రుద్రమ' సైనికులుగా మారడం విశేషం.రుద్రమ టీంకు అందించిన శిక్షణ సాధారణమైనది కాదు. సుమారు నెలన్నర పాటు దేశంలోని ప్రతిష్టాత్మక ఎన్ఎస్‌జీ (ఔఉ ), గ్రేహౌండ్స్ తరహాలో కఠినతరమైన కమాండో ట్రైనింగ్‌ను వీరికి ఇప్పించారు. నిత్యం 10 కిలోమీటర్ల పరుగు, రోప్ క్లైంబింగ్, అడవుల్లో కూంబింగ్ వంటి సవాళ్లను వీరు అధిగమించారు. ముఖ్యంగా ఏకే-47, ఎస్ఎల్ఆర్ వంటి భారీ ఆయుధాలను వాడటంలో వీరు ఆరితేరారు. కళ్లకు గంతలు కట్టుకుని సెకన్ల వ్యవధిలో వెపన్స్‌ను విడదీయడం, తిరిగి అమర్చడం వంటి 'బ్లైండ్ ఫోల్డ్' విద్యలో వీరు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు.కేవలం యుద్ధ తంత్రాలే కాకుండా.. ఆపద సమయాల్లో తోటి వారిని రక్షించడం, మ్యాప్ రీడింగ్ ద్వారా అడవుల్లో గమ్యాన్ని చేరడం వంటి సాంకేతిక అంశాల్లోనూ వీరికి పట్టు సాధించారు. కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలతో పాటు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానంలోనూ శిక్షణ పొందారు. బాంబులను నిర్వీర్యం చేయడం వంటి




ప్రాణాంతకమైన పనులను కూడా వీరు అలవోకగా చేసేలా తీర్చిదిద్దారు.ఈ శిక్షణ పొందిన మహిళా కమాండోలు తమ అనుభవాలను పంచుకుంటూ.. మొదట్లో ఆయుధాలు పట్టాలంటే భయపడేవారమని, కానీ ఇప్పుడు పురుష కమాండోలతో సమానంగా ఎలాంటి ఆపరేషన్ అయినా చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలిగిందని గర్వంగా చెబుతున్నారు. వరంగల్ నగరంలో అల్లర్లు అణచడానికైనా, ప్రముఖుల బందోబస్తుకైనా, అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లకైనా ఈ 'రుద్రమ' బృందం ఇప్పుడు ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది.

# ఆపరేషన్ సముద్రయాన్...

చెన్నై, జనవరి 22, చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది.అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నైఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు.డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు.అయితే సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ఫలితంగా భారత ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందిన దేశంలా కాకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశాలకు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

# బీఆర్ఎస్ చేరికలు

హైదరాబాద్ ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్చెరు నియోజకవర్గాలకు చెందిన పలువురు కీలక నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హరీష్ రావు వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతి ద్వారా ప్రతినెలా నిధులు విడుదల చేసి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదు. దీంతో మున్సిపాలిటీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి, చెత్త ఎత్తడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని అన్నారు. నిధుల కొరతతో పట్టణాల్లో పారిశుధ్యం లోపించింది. దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. స్ట్రీట్ లైట్లు వెలిగే పరిస్థితి లేదు. తాగునీటి సరఫరాలో కూడా కోతలు విధిస్తున్నారు. ఇస్నాపూర్, గుమ్మడిదల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. ఇప్పుడు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ జంక్షన్

హైదరాబాద్, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం నెలరోజుల్లో ప్రారంభం కానుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతితో, రూ.1090 కోట్లతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సాయిల్ టెస్ట్




జరుపుతున్నారు. నిర్వాసితులకు టీడీఆర్ ఇచ్చేందుకు అంగీకరించారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.కేబీఆర్ పార్క్ ప్రాంతంలో ట్రాఫిక్ మామూలుగా ఉండదు. ఈ సమస్య పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని తీసుకున్న నిర్ణయం ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. మరో నెలరోజుల్లోగా ఈ పనులు ప్రారంభం అవుతాయని సమాచారం. ఈ ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించడంతో పనులు త్వరలోనే మొదలవుతాయని భావిస్తున్నారు. రెండేళ్లలో ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంలో భాగంగా నేల పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి హెచ్-సిటీ ( హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రోగ్రామ్ కిందకు వస్తాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉండే భారీ ట్రాఫిక్‌ను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఐటీ కారిడార్ వైపు అంటే మదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మణికొండ వైపు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.ఎందుకంటే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, 12, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, మాసాబ్ ట్యాంక్ మార్గాల్లో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆఫీసు సమయాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్ల మీద నిలిచిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని భావించిన సర్కార్.. ఈ మార్గంలో సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల కోసం 6 ఫ్లైఓవర్లు, 6 అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది.ఇందుకు గాను ప్రభుత్వం రూ. 1090 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతాన్ని సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా అభివృద్ధి చేయడం వల్ల వాహనదారుల ప్రయాణ సమయం చాలా వరకు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. సంవత్సరన్నర క్రితమే నేల పరీక్షలు చేసినా.. భూసేకరణ ఇబ్బందుల వల్ల ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు.ఈ క్రమంలో తాజాగా బల్దియా.. ప్రాజెక్టు వల్ల ఆస్తులు కోల్పోతున్న వారికి టీడీఆర్ ఇస్తామని హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో ప్రస్తుతం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. దీని ఆధారంగా ఫ్లైఓవర్ల డిజైన్, నిర్మాణ విధానం, పిల్లర్ల ఎత్తును ఖరారు చేయనున్నారు. మరో రెండు రోజుల్లోనే సాయిల్ టెస్టింగ్ పూర్తి కానుందని, ఈ నేపథ్యంలో వచ్చే నెలలో నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలుపెట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల సామాన్య ప్రజలతో పాటు కొన్ని వాణిజ్య సంస్థలు కూడా తమ ఆస్తులను కోల్పోతున్నాయి. ఈ క్రమంలో అధికారులు వీరికి పరిహారం గురించి ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ నగదు పరిహారం కోరితే అక్కడున్న మార్కెట్ రేటుకు 2 రెట్లు ఎక్కువ ఇవ్వనున్నారు. లేదంటే టీడీఆర్ కోరితే మార్కెట్ విలువకు నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తామని చెబుతున్నారు.

========================

# ఎన్నికలకు రెడీ అవుతున్న పార్టీలు

ఖమ్మం, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఖమ్మం జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైనది ఒకవైపు ఎండలు వేడి ఎక్కువవుతుంది మరోవైపు రాజకీయ వేడి ఎక్కువవుతుంది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఖమ్మం జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఏదులాపురం,వైరా, కల్లూరు మధిర,నత్తుపల్లి లో ఎన్నికలు ఇన్చార్జిలను




నియమించుకున్నారు.మరోవైపు చాప కింద నీరు లాగా బలంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలైన సిపిఐ సిపిఎం పార్టీలు కూడా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్ ని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు వాళ్లకు బలంగా ఉన్నచోట పోటీ చేసి మిగతా చోట్ల ఎవరికి మద్దతు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు మిగతా పార్టీలైన బిజెపి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సైతం పోటీలో సిద్ధంగా ఉన్నాము అంటూ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో మంచి జోష్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే హవా కొన సాగించాలని, బిఆర్ఎస్ పార్టీ కూడా గత వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా పనిచేసే మంచి ఫలితాలను సాధించాలని వ్యూహరచనలు చేస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ సీపీఐ సిపిఎం పార్టీలు మధ్య పోటీ ఉండగా, కాంగ్రెస్ సిపిఐ కలిసి పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి, అదేవిధంగా బిఆర్ఎస్ సీపీఎం పార్టీలు కలిసి పోటీ చేసే ఆలోచనలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి అదే దిశగా పావులు కదుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు సంకల్పంతో పనిచేస్తున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి నియోజకవర్గంలో ఉన్న ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే మంత్రి పలుమార్లు పర్యటించి ఇన్చార్జిలని నియమించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిధిలో ఉన్న మధిర మున్సిపాలిటీలో అన్ని వార్డులతో సహా ఇన్చార్జిలను నియమించి వారితో చర్చించి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇకపోతే వైరా కల్లూరు సత్తుపల్లి మున్సిపాలిటీలలో మంచి పట్టు ఉన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఎమ్మెల్యే రాగమయి సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు దయానంద్ తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు చర్చించి వ్యూహాలను తయారు చేస్తున్నారు.మొత్తం మీద ముగ్గురు మంత్రులు కలిసి ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్ని వార్డులతో సహా కైవసం చేసుకోవాలని మంచి పట్టుదలతో పని చేస్తున్నారు. మరోపక్క బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అజయ్ కుమార్ వైరా పై దృష్టి పెట్టి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. మధిరకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, లింగాల కమల్ రాజు విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఎదులాపురం మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి,కల్లూరు సత్తుపల్లి కి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లను ఇన్చార్జిలుగా నియమించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఖమ్మం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో జెండాలు ఎగురవేసేందుకు ఎవరి వ్యూహాల్లో వారు రచిస్తున్నారు. ఖమ్మం అంటే తెలుగుదేశం కంచుకోట అని, కనుక తెలుగు తమ్ముళ్లు ఎవరికి మద్దతిస్తే వాళ్లే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనేది అందరూ భావిస్తున్నారు. ఇదే విషయాన్ని టిడిపి తమ్ముళ్లు పట్టు ఉన్నచోట పోటీ చేయాలని ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళారు. ఇందుకు టీడీపీ నాయకులు దానికి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈసారి ఖమ్మం జిల్లాలో టిడిపి కూడా పోటీలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# రేవంత్ స్ట్రాటజీనా... గులాబీ వాగ్ధాటా...

హైదరాబాద్, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత నాటి టీఆర్ఎస్ పటిష్టతకు అప్పటి సీఎం కేసీఆర్ చాలా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా తమ పార్టీ ఏర్పడిందే టీడీపీ నుంచి కాబట్టి, టీడీపీ ఉనికి లేకుండా చూసుకున్నారు. నయానో, భయానో టీడీపీ నేతలను తమ పార్టీలో చేర్చుకుని పదవులు కట్టబెట్టారు. టీడీపీని తెరమరుగు చేయడం ద్వారా.. టీఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉండేలా చూసుకోగలిగారు. అయితే.. రాజకీయాలు మారుతూ వచ్చాయి.ప్రస్తుతం కాంగ్రెస్ సీఎంగా రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు.రేవంత్ రెడ్డికి .. కేసీఆర్ స్ట్రాటజీలపై పక్కాగ అవగాహన ఉంది. 2029 ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావాలంటే.. బీఆర్ఎస్ సమస్యల్లో కొట్టుమిట్టాడాల్సిన అవసరముంది. అంటే ఆ పార్టీని దెబ్బతీయగలగాలి. అందులో ఇప్పటికే కొంతవరకూ సక్సెసయ్యారు కూడా. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ సహా పలు కేసులు కత్తుల్లా బీఆర్ఎస్ నేతల మెడలపై వేలాడుతున్నాయి. అయితే ఇది చాలదు .. ఇంకా చాలా చేయాలన్నది రేవంత్ స్ట్రాటజీగా కనిపిస్తోంది.అందులో ముఖ్యమైంది బీఆర్ఎస్ ను బలహీన పరచడం. దానికి గతంలో బలంగా ఉండి ఇప్పుడు .. నిస్తేజంగా మారిన పార్టీలను తిరిగి చిగురింపజేయడం.. అందులో భాగంగా ఇప్పటికే కమ్యూనిస్టులకు( ప్రాధాన్యమిస్తున్నారు. ఆయా పార్టీలతో కలిసి సభల్లో పాల్గొంటున్నారు కూడా. ఇప్పుడు రాష్ట్రంలో ఉనికే కనుమరుగైన టీడీపీని కూడా కాస్త చిగురింప చేస్తే.. బీఆర్ఎస్ లోని కొందరు



నేతలు? అటువైపు వెళ్లే అవకాశముంటుంది. ఆమేరకు వారి బలం కాస్త తగ్గితే.. అది వచ్చే ఎన్నికల్లో తమకు మేలు చేస్తుందన్నది రేవంత్ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఆ స్ట్రాటజీలో భాగంగానే బీఆర్ఎస్ దిమ్మెలు కూల్చేయాలని సీఎం హోదాలో ఉండి సీఎం రేవంత్ రెడ్డి.. టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లు కనిపిస్తోంది. దీన్ని బీఆర్ఎస్ కూడా గట్టిగానే ఎదుర్కొంటోంది. రేవంత్ రెడ్డి ఇప్పటికే అమరావతి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారంటూ ఎదురుదాడి చేస్తోంది. ఇదే సందర్భంగా మళ్లీ తెలంగాణ సెంటిమెంట్, ఉద్యమ పార్టీ అంటూ పాత అంశాల్ని ప్రస్తావిస్తోంది. మరి.. రేవంత్ స్ట్రాటజీ వర్కవుట్ అవుతుందా..? బీఆర్ఎస్ వాగ్దాటి గెలుస్తుందా..? వేచి చూడాల్సిందే?!


=========================

# 19 లక్షలకే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు...

హైదరాబాద్, ,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ హైదరాబాద్‌లో సొంతింటి కల కలిగిన వారి కోసం 289 రెడీ-టు-మూవ్ ఫ్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నల్లగండ్ల, మియాపూర్, బండ్లగూడ వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ 1ఃఊఐ, 2ఃఊఐ ఫ్లాట్లను పారదర్శకమైన ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. సింగిల్ బెడ్రూమ్ ధరలు రూ. 13 లక్షల నుండి ప్రారంభం కాగా.. డబుల్ బెడ్రూమ్ ధరలు రూ. 19 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తుదారులు జనవరి 31 లోపు టోకెన్ అడ్వాన్స్ చెల్లించాలి. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో లాటరీ డ్రా నిర్వహిస్తారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సొంత ఇల్లు లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఐదేళ్ల లాక్-ఇన్ పీరియడ్ నిబంధన కూడా ఉంది.తెలంగాణ రాష్ట్రంలో సొంతింటి కలను నెరవేర్చే దిశగా మరో కీలక అడుగు పడింది. తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెడీ-టు-మూవ్ ఫ్లాట్ల విక్రయానికి ప్రకటన విడుదల చేసింది. మంగళవారం (21-01-2026) నోటిఫికేషన్ జారీ చేస్తూ.. హైదరాబాద్ నగర పరిధిలోని కీలక ప్రాంతాల్లో నిర్మితమైన ఫ్లాట్లను లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నట్లు ప్రకటించింది.ఈ పథకంలో భాగంగా పోచారం, బండ్లగూడ, మేడ్చల్ మల్కాజ్‌గిరి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉన్న ఫ్లాట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. 1ఃఊఐ, 2ఃఊఐ ఫ్లాట్లు వివిధ విస్తీర్ణాల్లో అందుబాటులో ఉండగా.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా ధరలను నిర్ణయించారు. మొత్తం 289 ఫ్లాట్స్‌ను ఈ వేలం ద్వారా విక్రయించనున్నట్లు టీజీఆర్ఎస్సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. 1ఃఊఐ ఫ్లాట్ల విస్తీర్ణం సుమారు 523 నుంచి 645 చదరపు అడుగులు కాగా.. వాటి ధరలు రెగ్యులర్ ఫ్లాట్స్‌కు సుమారు రూ. 13 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు నిర్ణయించారు. అలాగే 2ఃఊఐ ఫ్లాట్లు 761 చదరపు అడుగుల విస్తీర్ణంతో.. రెగ్యులర్ ఫ్లాట్ల ధరలు రూ.19 లక్షలుగా నిర్ణయించారు. ఇక మోడల్ ఫ్లాట్ల ధరలు ఒక చదరపు అడుగుకి రూ.2750 నుంచి రూ. 2500లుగా నిర్ణయించారు.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు ఒక చదరపు అడుగుకి రూ.3200లుగా నిర్ణయించారు.

ప్రతి ఫ్లాట్‌కు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలతో పాటు పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఫ్లాట్ల కేటాయింపు పూర్తిగా ఆన్‌లైన్ లాటరీ విధానంలో జరగనుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం



ఫిబ్రవరి 4 మరియు 5 తేదీల్లో లైవ్ లాటరీ డ్రా నిర్వహించనున్నారు. ఈ లాటరీ డ్రాను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనుండటంతో.. పూర్తి పారదర్శకత ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుడి ఆదాయం నెలకు.. 1ఃఊఐ ఫ్లాట్లకు రూ. 35,000, 2ఃఊఐ ఫ్లాట్లకు రూ. 50,000గా నిర్ణయించారు. వీటితో పాటు.. నో హౌస్ సర్టిఫికేట్ ను డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు.. ప్రాజెక్ట్ సైట్ లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారు, వారి కటుంబ సభ్యులకు కొత్త జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని కండీషన్ పెట్టారు. వీటితో పాటు.. దరఖాస్తుదారుడు ఒక కుటుంబం నుంచి ఒక్క దరఖాస్తు మాత్రమే సమర్పించాలి. ఆస్తిని ఇతరులకు బదిలీ చేయడానికి తప్పనిసరిగా లాక్ ఇన్ పిరియడ్ 5 ఏళ్ల వరకు ఉంటుందన్నారు.ఇక రిజిస్ట్రేషన్ చేసుకునే వారు సింగిల్ బెడ్రూం ఫ్లాట్స్ కు టోకెన్ అడ్వాన్స్ రూ.లక్ష.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు టోకెన్ అడ్వాన్స్ రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గడువు జనవరి 31 సాయంత్రం 5 గంటల వరకు ఇచ్చారు. లాటరీలో ఎంపిక కాకపోయిన వారికి ఈ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని ప్రకటించింది.ఇక ఈ ఫ్లాట్లు నగరంలోని ఐటీ కారిడార్లు, రాఖీఖీ, మెట్రో, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు సమీపంలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్వగృహ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని.. సందేహాల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తంగా చూస్తే... పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరల మధ్య ప్రభుత్వ ఆధ్వర్యంలో నమ్మకమైన గృహావకాశం పొందే అవకాశంగా ఈ స్వగృహ ఫ్లాట్ల విక్రయం నిలవనుంది. సొంతింటి కలతో ఎదురుచూస్తున్న అనేక కుటుంబాలకు ఇది ఒక మంచి అవకాశంగా మారిందని చెప్పవచ్చు.

# సీటీలో రోడ్ల విస్తరణ

హైదరాబాద్,,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

హైదరాబాద్ వాసులకు హెచ్‌ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్‌ఎండీఏ చేపట్టింది.

హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది.ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట, మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా



అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునిక ల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

==================

# సింహగిరిపై నేత్రపర్వంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి 'స్వర్ణ పుష్పార్చన'?

సింహాచలం, కలియుగ వైకుంఠంగా, కోట్లాది మంది భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం నాడు "స్వర్ణ పుష్పార్చన" సేవ అత్యంత వైభవంగా, ఆగమ శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ సేవలో పాల్గొని భక్తులు తన్మయత్వం చెందారు.?వైభవంగా ఆరాధన - కనుల పండుగగా అలంకరణ:ఆలయ కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి ఎన్. సుజాత గారి ఆదేశాల మేరకు, పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరావు గారి పర్యవేక్షణలో ఈ విశేష ఉత్సవం జరిగింది. గురువారం వేకువజామునే అర్చకస్వాములు అప్పన్న స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యారాధనలు, ప్రాతఃకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆలయ కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు.?వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి 108 బంగారు పుష్పాలతో (స్వర్ణ పుష్పాలు) అర్చన గావించారు. అర్చక స్వాములు ఒక్కో సువర్ణ పుష్పాన్ని ఆ దేవదేవుని పాదాల చెంత సమర్పిస్తూ, అష్టోత్తర శతనామావళిని పఠిస్తుండగా.. ఆ దృశ్యాన్ని వీక్షించిన భక్తుల మనసు ఆధ్యాత్మిక ఆనందంతో పులకించిపోయింది. పసిడి కాంతుల్లో మెరిసిపోతున్న స్వామివారిని దర్శించుకున్నారు.?ఈ అపురూప వేడుకను కళ్లారా వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని పునీతులయ్యారు.

# నాగరికత నీ పయనం ఎటు?

ఆధునికత పేరున
యువత పెడ దారిన
పయనిస్తోంది
సాంకేతికత పెరిగి
సంక్షోభిత సమాజం వైపు
పరుగులిడుతుంది
ఒంటరి తనం పెరిగి
ఆందోళన వటవృక్షమై
హింసరాజ్యమేలుతుంది
ఆత్మీయత అనురాగం
అవగాహన అంతరించి
హత్యలు ఆత్మహత్యలు
సమాజాన్ని శాసిస్తున్నాయి
నేర రాజకీయాలు
కుట్ర కుతంత్రాలు పెరిగి
మానవీయత
మాయమవుతుంది
కులం మతం పేరున
సమాజాన్ని విడదీసి
పెత్తనం చెలాయిస్తూ
చెలరేగుతున్న
శక్తుల ఆటకట్టించాలి
నాగరికత పేరున
ఫ్యాషన్ పెనుభూతమై
ఒంటిపై బట్టలు లేక
ఒళ్ళు జలదరించే
ప్రదర్శనలతో
పెటత్రేగుతున్న
యువత మారాలి
భారత దేశ సంస్కృతి
రక్షకులుగా ఎదగాలి
మనిషిని మనిషిగా
ప్రేమిద్దాం
విజ్ఞానంతో పాటు వివేకం
ప్రగతితో పాటు ప్రకృతిని
కాపాడుదాం
అందరికి
సమానావకాశాలు
కల్పిద్దాం నాగరికత
పరిపూర్ణతకు
పాటుపడుతాం
ప్రకృతిని మానవత్వాన్ని
భవిష్యత్ తరాలకు
అందించడమే నాగరికత
నాగరికతను రక్షిద్దాం
మానవ జాతికి ఉజ్వల
ఉత్తమ జీవన నాణ్యతను
అందిద్దాం
నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజి ఆర్థిక అధ్యయన
వేదిక
హైదరాబాద్ 9440245771

# రహదారి భద్రత అందరి బాధ్యత : సైబరాబాద్ ట్రాఫిక్ డీసీసీ సాయిమనోహార్





వాహన చోధకులు రహదారి నియమ నిబంధనాలు పాటినస్తూ నిదానవమే ప్రధానంగా ముందుకు సాగాలని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆరైవ్ ఆలైవ్‌లో భాగంగా అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక క్షణం నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతోందన్నారు. వాహన దారులు ఖచ్చితమైన నియమ నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగం, ఒవర్‌టేకింగ్, డ్రైవ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, వాడకం ప్రాణ రక్షణకు కవచం లాంటివని వీటిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను అతిక్రమించకుండా, కుటుంబాల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.రహదారి భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ హన్మంత్‌రావు, ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు వివిధ పోలీస్ ట్రాఫిక్ స్టేషన్‌లకు చెందిన ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.

# భైంసా మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు: భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 22 (భారత శక్తి): భైంసా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఘటనపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికుల ఫిర్యాదులు మరియు 2025 సెప్టెంబర్ 12న జరిగిన సమ్మె అనంతరం మున్సిపల్ కౌన్సిల్ పనితీరుపై విచారణ చేపట్టగా,



అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. భైంసా మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా ఉన్న భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ఆదేశాల మేరకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విజయ్, అన్సార్, సలీం, ఆరిఫ్‌తో పాటు అర్షద్ బేగ్ (అమీర్), జావాన్‌లను తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించారు. విచారణలో ఈ వ్యక్తులు ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడి నుంచి రూ.2,500 చొప్పున అక్రమంగా వసూలు చేసినట్లు వెల్లడైంది. ఈ విషయమై ఉత్తర్వుల ప్రతులను సమాచారం కోసం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు మరియు అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) నిర్మల్ ఫైజాన్ అహ్మద్‌కు పంపించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం మరియు బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘం భైంసాకు అవసరమైన చర్యలు చేపట్టి అమలు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

# బాలికల భవితకు బంగారు బాట వేద్దాం

## (జనవరి 24 జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా)

సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు వివక్ష పై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహిస్తారు.

జాతీయ బాలిక దినోత్సవంబి చరిత్ర

1966 సం" జనవరి 24 స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ భారత దేశపు తొలి మహిళా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఆమె సాధించిన విజయానికి గుర్తుగా మహిళా సాధికారతకుచిహ్నంగాజాతీయ బాలికా దినోత్సవం జనవరి 24' 2008 నుండి కేంద్ర ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ కేంద్ర ప్రభుత్వం 'మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖఆధ్వర్యంలో నిర్వహిస్తారు. "బాలికా దినోత్సవ సందర్భంగా" బాలికల సాధికారిత సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం 'విద్య 'భద్రత సామాజిక ఎదుగుదల బాలికలకు 'బాలురతో సమాన హక్కులు' సమాన అవకాశాలు స్వేచ్ఛ బాలికను గౌరవించడం అన్ని రంగాలలో బాలురతో సమానంగా అవకాశాలు ఇవ్వడం .బాలికల పట్ల వివక్షతను తొలగించడం . సాంఘిక 'ఆర్థిక సమానత్వ కల్పన 'జెండర్ సమానత్వం సామాజిక భద్రత మొదలగు అంశాల మీద అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపపట్టడం జరుగుతుంది.

విభిన్నత పేరున బాలికల పట్ల వివక్ష

సమాజం విభిన్నత పేరుతో బాలికల పట్ల వివక్ష కొనసాగుతోంది. కుటుంబాల వారసులుగా కొడుకులనే నిర్ణయించే సంస్కృతి కూతుళ్ళ పై లైంగిక వివక్షచోటుచేసుకొవడం శోచనీయం . బాలికలు ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తించబడ్డారు. బాలికలు వంశాన్ని నిలబెట్టే యంత్రాలుగా ఆడవాళ్ళను ఆటవస్తువుగా .సెక్స్ సింబల్గా చూసే సంస్కృతి రాజ్యమేలుతుంది.

జాతీయ బాలికా దినోత్సవం-2026 థీమ్

ఈ సంవత్సరము జాతీయ బాలికల దినోత్సవం యొక్క థీమ్ ప్రతి కుమార్తెను సాధికారిత చేయడం బలమైన భారతాన్ని నిర్మించడం.

మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

మహిళా నాయకత్వ లక్షణాలు పెంపొందించడం.లింగ వివక్షతను అంతం చేయడం.స్త్రీల హక్కుల పట్ల అవగాహన కల్పించడం .బాలిక విద్యను ప్రోత్సహించడం. సామాజిక రుగ్మతలైన బాల్య వివాహాలు బ్రూణ హత్యలు గృహింస లైంగిక వేధింపులను స్త్రీల అక్రమ రవాణానుఅరికట్టడం.

ఆడపిల్లనే అనే సంస్కృతి

ఆడపిల్ల అంటే "ఆడపిల్లనే" అనే సంస్కృతి సమాజంలొ నెలకొనడం బాలికల పాలిట శాపంగా పరిణమించింది. తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలియగానే "భ్రూణ హత్యలకు" పాల్పడటం సర్వసాధారణమైంది.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం

కుటుంబం నుండే ఆడపిల్ల నిర్లక్ష్యం పెంపకంలొ వివక్షతకు గురికావడం విచారకరం. కుటుంబం నుండి మొదలైన వివక్షత నిర్లక్ష్యం చిన్న చూపు అన్ని రంగాలలో నెలకొనడం వల్ల బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక 'సాంఘీక ' ఆర్థిక 'సామాజిక వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది . సమస్యల విషవలయంలో చిక్కుకు పోయిన ఆడపిల్లల అభివృద్ధి సంక్షేమం ఆశించిన మేరకు జరుగలేదు. ఆడ పిల్లలను కించపరచడం సామాజిక రుగ్మతైంది.


చట్టాలు విఫలం

బాలికలకు విద్య వైద్యం ఆహారం చట్టబద్ధమైన హక్కు ఆరోగ్య సంరక్షణ సామాజిక భద్రత బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించాలని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు పథకాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు . సమస్యలే ఆడపిల్లల ఆస్తులుగా అవమానాలు నిర్లక్ష్యం అనారోగ్యం వేతన వివక్ష వారికి ఆభరణాలుగా పరిణమించాయి.

రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన " "భేటీ బచావో బేటి పడావో" అనే పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశ పెట్టిన పథకం రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది.

బాలికల సంరక్షణ కొరకు ఆడపిల్లలకు షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం' కిశోరి శక్తి యోజన సుకన్య 'స్వమృద్ధి యోజన పౌష్టి ఆహార పథకం మొదలగు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.



స్త్రీల అక్షరాస్యత

జనాభాలో నేటికీ 20 కోట్ల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

స్త్రీ పురుష నిష్పత్తి

2015 సం"లో దేశంలో కౌమార బాలికల సంఖ్య 25.3శాతం ఉంది.రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది .ఇలాగే కొనసాగితే అనేక సామాజిక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉన్నారు. 2015 నాటికి స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 929 మంది స్త్రీలకు తగ్గడం పట్ల సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు.

బడి మానేసే వారిలో బాలికలు ఎక్కువ×( స్కూల్ డ్రాప్ అవుట్ రేటు)

భారత్ లో ప్రతి 11 మంది పిల్లల్లో ఒకరు ఐదు సంవత్సరాలలోపు వారే ఎక్కువగా మరణిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బరువు తక్కువగా ఉన్న శిశువుల్లో 35 శాతం మంది భారతదేశంలో జన్మిస్తున్నారు. 65 శాతం బాలికలు 18 సంవత్సరాలలోపు వివాహలై తల్లులవుతున్నారు .ప్రతి 100 మంది బాలల్లో 19 మంది స్కూలుకు వెళ్లడం లేదు. సెకండరీ స్థాయికి చేరుకునేసరికి డ్రాప్ అవుట్ రేటు 50% కంటే ఎక్కువగా ఉంది.

బాలికల విద్యబి సమస్యలు

మౌలిక సదుపాయాలు లేక చాలా మంది బాలికలు బడికి వెళ్లడం లేదు. లింగ వివక్షత పక్షపాత ధోరణి కుల వివక్ష విద్య వ్యవస్థలో హింసాత్మకంగా దోరణులు ప్రబలడం పిల్లలను శారీరకంగా దండించడం మొదలైన కారణాల వల్ల స్కూలు మధ్యలోనే మానేస్తున్నారు.

బాలికలు నిరంతర లింగవి వక్షతో పెరగడం. పోషకాహార లోపం కుటుంబంలోని వారి చేతుల్లో లైగింక గృహ హింసకు గురికావడం

బాలికలకు శాపంగా పరిణమించింది.

బాల్యవివాహాలు× దేశంలో 26.5శాతం బలవంతపు బాల్య వివాహాలు జరుగుతున్నాయి.ప్రపంచములో జరుగుతున్న 40 శాతం బాల్యవివాహాలు మన దేశములో జరుగుతున్నాయని "యూనిసెఫ్" వెల్లడించింది . మన దేశములో 40 శాతం బలవంతపు బాల్య వివాహాలు పశ్చిమబెంగాల్లో చోటుచేసుకోవడంగమనార్హం.

బ్రూణహత్యాలు

ఆడపిల్లను మైనస్ గా భావించి మగ శిశువును ప్లస్ గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణహత్యాలకు బలై వివక్షతకుగురిఅవుతున్నారు.

పేదరికం.అల్పపౌష్టికాహారం

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో అసంఘటిత ప్రైవేట్ రంగంలో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి 'లైంగిక వివక్షతకు భిక్షాటనకు గురవుతూ తమ అమూల్యమైన బాల్య దశను 'పేదరికం' ఆకలిచావులు అల్ప పౌష్ఠికాహారం' అనారోగ్యానికి గురౌతున్నారని అనేక అద్యయనాలల్లో తేలింది.

బాలికల సంరక్షణ చర్యలు

ప్రభుత్వం బాలికల సమగ్ర వికాసానికి సంరక్షణకు అవసరమయ్యే విధానాలను అమలు చేయాలి.

1)బాలికల భద్రత " లింగ నిష్పత్తి 'విద్య 'వైద్యం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

2)బాలికలకు బాలురతో పాటు సమాన అవకాశాలు సమాన హక్కులు' స్వేచ్ఛ కల్పించాలి .

.3)బాలికల అభివృద్ధియే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యావకాశాల సాధనకు" ప్రతేక నిధిని" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్య.

4)ప్రభుత్వం 2008లో ఆడపిల్లల చైల్డ్ సెక్స్ అబ్యూస్డు కార్యక్రమాన్ని స్కూళ్లలో ప్రవేశపెట్టి బాలికలు ఎదుర్కొంటున్న లైంగిక హింస నివారణ బాలికల రక్షణ పునరావాస చర్యలు భారీస్థాయిలో తీసుకుంది . ప్రభుత్వం బాలికలు ఎదుర్కొంటున్న సామాజిక ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు కృషి చేసింది దాని ఫలితంగా కేరళ నుండి ఒక బాధిత బాలిక మంత్రిగా ఎదిగారు అనేక మంది బాలికలు లెక్చరర్లుగా న్యాయవాదులుగా రాణిస్తున్నారు.

6)జాతీయ నేరాల విభాగం లెక్కల ప్రకారం ఇప్పటికీ 100000 బాలికల్లో 66.4% మంది బాలికలు రక రకాల వేధింపులకు గురైనట్లు బాధితులో ఎక్కువ దళిత వర్గాలకు చెందినవారు ఉన్నారు. దేశం బాలిక ల లైంగిక వేధింపుల నివారణలో బాలికల రక్షణ లో అట్టడుగు స్థాయిలో ఉండడం గమనార్హం.

7)బాలికను స్వతంత్ర వ్యక్తిగా చూడాలి×

బాలికను రక్షించాల్సిన బలహీన వ్యక్తిగా కాకుండా స్వతంత్ర వ్యక్తిగా చూడగలిగిన రోజే నిజమైన మార్పు వస్తుంది.

8)బాలికల పోరాటంలో బాలిక ఒంటరి కాకూడదు. ఆమెకు కుటుంబం సమాజం ప్రభుత్వం అందరూ కలిసి అండగా ఉండాలి.

9)బాలిక బలంగా నిలబడితేనే దేశం బలంగా నిలుస్తుంది .

10)జాతీయ బాలికల దినోత్సవం ప్రతి ఆడపిల్లకు భద్రత స్వేచ్ఛ విద్య ఆత్మగౌరవం అందే సమాజాన్ని నిర్మించాలనేసంకల్పం తో నిర్వహించాలి. ఒక్క రోజుకే పరిమితం కాకూడదు నిరంతరం బాలికల అభివృద్ధి సంరక్షణ సంస్కృతిని పెంచాలి.ప్రభుత్వం పౌర సమాజం ఆ దిశగా

అడుగులు వేయాలి.

బాలికలరక్షణ సామాజిక బాధ్యత

బాలికల హక్కుల రక్షణ భద్రత పౌరసమాజం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఆడపిల్లలను మగపిల్లలతో పోటీ పడేట్లు ప్రోత్సహించాలి .అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి

12)ఆడపిల్లల అభివృద్ధి దేశాభివృద్ధిగా భావించాలి. దేశ ప్రగతి పురోగతిలో ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలి.

13)బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి.

14)సమాజంలో మహిళాల పట్ల గౌరవం ఆర్థికస్థాయి.సామాజిక హోదా పెంచాలి.

బాలికల సంరక్షణ ప్రభుత్వం

బాల్య వివాహాలు బాలికలఅక్రమ రవాణా' అత్యాచారాలు' లైంగిక వివక్ష మొదలగు సమస్యల నుండి ఆడ పిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వంతీసుకోవాలి .పౌరసమాజం యువజన సంస్థలు మహిళా స్వచ్ఛంద సంస్థలు సంఘాలు ఆడపిల్లల సంరక్షణ హక్కుల రక్షణకు పాటుపడాలి.

బాలికలు డిజిటల్ విద్య

ప్రభుత్వం బాలికలకు కంప్యూటర్ విద్య డిజిటల్ విద్య టెక్నాలజీ ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య ఉపాధి దోహక విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి . బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి . బాలికల సామాజిక ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి.

మహిళా రిజర్వేషన్స్

కేంద్ర రాష్ట్ర 'ప్రభుత్వ 'ప్రైవేట్ రంగ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. చట్టసభల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి. రాజకీయాలలో స్త్రీల వాటా పెంచాలి. మహిళలను పారిశ్రామిక వేత్తలుగ ఎదిగేట్లు వాతావరణం కల్పించాలి.

మహిళా సాధికారిత

ప్రభుత్వం మహిళా సాధికారిత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక 'పారిశ్రామిక 'వ్యవసాయ వ్యాపార 'వాణిజ్య 'రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి .

బాలికల స్థిగతుల్లోమార్పు ఒక్క రోజు సంబురమే కాకూడదు. ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రాతిపదిక మీద బాలికల రక్షణ పునరావాసం సంక్షేమ చర్యలు చేపట్టాలి.

ఉచిత వొకేషనల్ విద్య అందించాలి

బాలికల కొరకు ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి.

సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలి. లింగ వివక్ష విద్యలో అసమానతలు పోషకాహారలోపం అనారోగ్య సమస్యలు బాల్య వివాల నివారణ అక్రమ రవాణా మొదలైన అంశాల మీద అవగాహన కార్యక్రమాలు ఏర్పరచాలి. సమాజంలో మహిళల పట్ల గౌరవం హోదా పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలి. వారు సాధారణ జీవితంలో ఎదుర్కొనే రకరకాలైన వివక్షను దోపిడీని తొలగించాలి .శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక రాజకీయ క్రీడారంగాల్లో కీలకపాత్ర పోషించేలా స్త్రీలకు మరిన్ని అవకాశాలు కలిగించాలి.

ఆర్థిక స్వేచ్ఛ ఉపాధి కల్పన కోసం బాలికల నైపుణ్యాలను మెరుగుపరచాలి .

బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం

ఆడపిల్లలను పుట్టనిద్దాం బతుకనిద్దాం చదువనిద్దాం ఎధుగనిద్దాం అన్న నినాదం విధానమైనప్పుడే బాలికల దినోత్సవం ఆశయాలు నెరవేరుతాయి . స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అందువల్ల ఆడపిల్లలను రక్షించుదాం. అమ్మాయిలను ఆదరిద్దాం. బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం .

నేదునూరి కనకయ్య అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం

సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక9440245771

# పేద కుటుంబానికి అండగా నిలిచిన యువ నాయకుడు మూడుచింతల నరేందర్ రెడ్డి - అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

గుమ్మడిదల,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీలో నివసించే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు తుడుం రాజమ్మ భర్త నరసయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెన్నార్ యువసేన వ్యవస్థాపకులు మూడు చింతల నరేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం పెద్ద మనసుతో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసాకల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సురేందర్ రెడ్డి తులసీదాస్, నాయకులు ఆంజనేయులు, రామా గౌడ్ శీను రవీందర్ రెడ్డి రాజిరెడ్డి కర్ణాకర్, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,హరీష్, హజర్,అశోక్ యాదగిరి,మహమ్మద్, నరసింహులు,



రమేష్, శ్రీను సుధాకర్,సురేష్,సాయి, లింగం బాధిత కుటుంబ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

## గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి : జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.గురువారం సంగారెడ్డి పట్టణంలోని దుర్గాబాయి దేశముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలకు మంచి జరగాలంటే సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టం?2018పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆరు బ్యాచులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ




శిక్షణను సర్పంచులు సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డి పి ఓ జానకి రెడ్డి ,డీఎల్పీఓలు అనిత, అమృత, సంజీవరావు, పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భైంసా మున్సిపల్ సిబ్బందికి నెస్లే సంస్థ రేషన్ కిట్ల పంపిణీ -106 మంది పారిశుద్ధ్య కార్మికులకు లబ్ధి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 22 (భారత శక్తి): భైంసా మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ నెస్లే కంపెనీ ఆధ్వర్యంలో 106 మంది మున్సిపల్ శానిటేషన్ కార్మికులకు రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం భైంసా మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మరియు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ అజ్మీరా సంకేత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులకు రేషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కరోనా కాలం అయినా, వర్షాకాలంలోనైనా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అహర్నిశలు కష్టపడే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవి. వీరి కృషి వల్లే భైంసా పట్టణం పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుంది” అని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ నెస్లే కంపెనీ రోజువారీ అవసరాలకు ఉపయోగపడే ఆహార



ధాన్యాలతో కూడిన రేషన్ కిట్లను బహుమతిగా అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఆటల్లో మెరిసిన దివ్యకు ఆసరా, అంతర్జాతీయ పోటీలకు చేయూత

## డాక్టర్ పద్మావతి భోస్లే, మేనేజింగ్ డైరెక్టర్ నంద కిషోర్ భోస్లే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 22 (భారత శక్తి): భైంసా మండలం సుంక్లీ గ్రామానికి చెందిన దివ్య (తండ్రి రమేష్) క్రీడా రంగంలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బాక్సింగ్‌లో ఇప్పటికే రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సాధించిన దివ్య, తాజాగా అంతర్జాతీయ అర్నిస్ పోటీలకు ఎంపికై జిల్లాకే గర్వకారణంగా నిలిచింది.

జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు హాజరుకావడానికి ఆర్థిక సహాయం అవసరమవడంతో, భైంసాలోని సాక్షి మెటర్నిటీ హాస్పిటల్ ముందుకు వచ్చి మానవీయత చాటింది. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పద్మావతి బోస్లే మరియు మేనేజింగ్ డైరెక్టర్ నంద కిషోర్ భోస్లే దివ్యకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఆమె క్రీడా ప్రయాణానికి బలమైన మద్దతుగా నిలిచారు.

“అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించి దేశానికి పేరు తీసుకొస్తాను” అని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న దివ్యకు అందిన ఈ చేయూత పలువురిని ప్రశంసించేటట్లు చేసింది. ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదన్న ఉద్దేశంతో ముందుకు వచ్చిన డాక్టర్ల సహృదయతకు స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ



అభినందనలు తెలిపారు.

# ఎగిరిన డ్రోన్, పెరిగిన ఆత్మవిశ్వాసం




సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 22:

డ్రోన్ బూట్ క్యాంపు నాలుగో రోజు, గీతం విద్యార్థులు డ్రోన్ అసెంబ్లీపై స్వీయ అవగాహనను ఏర్పరచుకోవడంతో పాటు, వాటిని ఎగరవేయడంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల మార్గదర్శనంలో, ఏడు క్వాడ్ ఎక్స్ కాప్టర్లను విజయవంతంగా పరీక్షించారు. డ్రోన్ నిర్మాణం, పనితీరు పరీక్షలో విలువైన ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు.జీపీఎస్ ఆధారిత హెక్సాకాప్టర్ ను ఎగరవేయడానికి విద్యార్థులకు అవకాశం ఇచ్చారు. ఇది పరిశ్రమ స్థాయి డ్రోన్లలో ఉపయోగించే అధునాతన నావిగేషన్, విమాన స్థిరీకరణ, నియంత్రణ వ్యవస్థలను తెలుసుకునే వీలు కల్పించింది. దీనికి అదనంగా, ప్రాథమిక విమాన నియంత్రణలు, యుక్తి పద్ధతులను అర్థం చేసుకుంటూ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బుల్లి (నానో) డ్రోన్ ఫ్లయింగ్ కార్యక్రమాలను నిర్వహించారు.రోజంతా, విద్యార్థులు డ్రోన్ అసెంబ్లీ, క్రమాంకనం, విమాన కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. అభివృద్ధి చెందుతున్న వైమానిక సాంకేతికతల పట్ల ఆసక్తి, సాంకేతిక ఉత్సుకత, ఉత్సాహాన్ని ప్రదర్శించారు.మొత్తంమీద, డ్రోన్ బూట్ క్యాంపు పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించడమే గాక, డ్రోన్ సాంకేతికతలో సైద్ధాంతిక జ్ఞానాన్ని, వాస్తవ-ప్రపంచ వినియోగం మధ్య ఉన్న అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించింది.

# ఫైరింగ్ సాధనలో పాల్గొన్న పోలీస్ అధికారులు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జనవరి22: వార్షిక ఫైరింగ్ సాధనలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన పోలీస్ సిబ్బందితో పాటు శాంతి భద్రతలకు చేందిన పోలీస్ అధికారులు గత రెండు రోజులుగా ధర్మసాగర్ మండల కేంద్రం శివారులో ప్రాంతంలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ సాధన చేస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు, డిసిపిలు,అదనపు డిసిపిలు, ఏసిపిలు,ఆర్.ఐలు ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొని వివిధ రకా తూపాకులతో సాధన చేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ రాబోవు రోజుల్లో ఈ ప్రాంతాన్ని ఫైరింగ్ సాధన చేసేందుకుగాను మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం కోసం తీసుకోవల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో ముచ్చటించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ ఫైరింగ్ సాధనలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులను అందజేయడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈకార్యక్రమములో డిసిపిలు అంకిత్ కూమార్,దారా కవిత, రాజమహేంద్రనాయక్,ఏ.ఎస్పీలు చేతన్,శుభం, ట్రైనీ ఐపిఎస్ మనీషా నేహ్రా,అదనపు డిసిపిలు సురేష్‌కుమార్,రవి,రాయల ప్రభాకర్ రావు, శ్రీనివాస్,బాలస్వామి పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలి: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్., ఐపీఎస్.

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 22(భారత శక్తి):ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీడా. శబరీష్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి మరియు కోర్టు ఫలితాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.





ఈ సమావేశంలో నేరాల గుర్తింపు మరియు డిటెక్షన్‌లో సీసీ కెమెరాల వినియోగంపై చర్చించారు. కీలక ప్రాంతాలు మరియు సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థవంతంగా కొనసాగించాలని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా నమోదైన పెండింగ్ కేసులు, డిటెక్టెడ్ కేసులు మరియు కన్విక్షన్ సాధించిన కేసుల పురోగతిని సమీక్షించారు. తీవ్రమైన మరియు వివాదాస్పద కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరిపి, బలమైన సాక్ష్యాలతో చార్జ్ షీట్లు దాఖలు చేయడం ద్వారా కోర్టుల్లో శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్ కేసుల తగ్గింపును లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని, అంతర్ జిల్లా మరియు అంతర్ రాష్ట్ర స్థాయి సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని తెలిపారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. రాత్రి వేళల్లో పట్టణాలు, గ్రామాలు, హైవేలు, ఒంటరి ప్రాంతాలు మరియు సున్నిత ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించడం ద్వారా నేరాలను ముందుగానే నివారించాలని, ప్రజల్లో భద్రతా భావన పెంపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని తెలిపారు. ఫీల్డ్ పోలీసింగ్, దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.అనంతరం వివాదాస్పద కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించి కోర్టుల్లో కన్విక్షన్లు సాధించిన పోలీస్ అధికారులకు అభినందన పత్రాలు అందజేశారు.

# సేవే రాజకీయం.. భైంసా ప్రజల హృదయ యువ నేతగా సయ్యద్ ఇర్ఫాన్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 22 (భారత శక్తి)మాటలకన్నా సేవే ఓటు ? సయ్యద్ ఇర్ఫాన్‌కు పెరుగుతున్న ప్రజా మద్దతుప్రజల కోసం పదవి కాదు, సేవ కోసం రాజకీయాలు ? సయ్యద్ ఇర్ఫాన్ రాజకీయాలు పదవుల కోసం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అన్న భావనకు సజీవ నిదర్శనంగా మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ నిలిచారు. నిస్వార్థ సేవ, నిజాయితీ, మానవతా విలువలతో ఆయన భైంసా ప్రజల హృదయాల్లో ప్రత్యేకమైన స్థానం సంపాదించారు.ప్రత్యేకంగా కోవిడ్-19 వంటి అత్యంత సంక్షోభ కాలంలో, ప్రజలు భయంతో ఇళ్లకే పరిమితమైన సమయంలో, సయ్యద్ ఇర్ఫాన్ మాత్రం వెనకడుగు వేయలేదు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి అండగా నిలిచి, తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. పేద రోగుల వైద్య ఖర్చులు భరించడం, నిరుపేద అమ్మాయిల వివాహాలకు సహాయం చేయడం, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు చేయూతనివ్వడం వంటి సేవలతో ఆయన ప్రజలకు ఆశాజ్యోతిగా మారారు.ఈ నిరంతర ప్రజాసేవను గుర్తించిన మజ్లిస్ పార్టీ, గతంలో ఆయనకు 5వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం కల్పించింది. ఆ సమయంలో కూడా ఆయన పదవిని గౌరవంగా ఉపయోగించుకుంటూ, సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేవారు.ఇప్పుడు మునిసిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో, ప్రజలు మరోసారి సయ్యద్ ఇర్ఫాన్ నాయకత్వాన్ని కోరుతూ స్వయంగా ముందుకొస్తున్నారు. కేవలం 5వ వార్డు ప్రజలే కాకుండా, ఇతర వార్డుల నుంచి కూడా “మాకు సయ్యద్ ఇర్ఫాన్ కావాలి” అనే స్వరం వినిపిస్తోంది. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన నివాసానికి చేరుకుని, పూర్తి మద్దతు ప్రకటిస్తూ, మరోసారి ప్రజాసేవ మార్గంలో నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఎన్నికల వేళ మాటల రాజకీయాలు కాదు, చేసిన సేవలే ఓట్లుగా మారే పరిస్థితిలో, సయ్యద్ ఇర్ఫాన్ సేవా రాజకీయాలకు నిజమైన ప్రతీకగా ప్రజల మనసుల్లో నిలిచారు. అందుకే ఈ ఎన్నికల్లో భైంసా ప్రజలు ఆయనను మరోసారి తమ ప్రతినిధిగా చూడాలని బలంగా కోరుకుంటున్నారు.

# సినిమా

# నోరే అతిపెద్ద ఆయుధం



టాకీస్: మహిళలకు అతి పెద్ద ఆయుధం నోరే అంటోందీ బాలీవుడ్ నటీమణి ఐశ్వర్యరాయ్. ఏదైనా నచ్చనప్పుడు నిర్మొహమాటంగా 'కాదు' అని చెప్పగలగడమే ఒక మహిళకు ఉండే అసలైన శక్తి అని ఆమె అభిప్రాయ పడ్డారు. గతంలో ఆమె ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చెప్పిన ఈ మాటలు నేటికీ ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నాయి. కేవలం విజయాలు సాధించడమే కాదు, మన విలువలకు వ్యతిరేకంగా ఉన్నవాటిని తిరస్కరించడం కూడా గొప్ప విషయమేనని ఆమె నొక్కి చెప్పారు. సమాజం మనపై రుద్దే అంచనాలను చూసి భయపడకుండా, వాటిని ఒక సవాల్‌లా తీసుకోవాలని ఐశ్వర్య పిలుపునిచ్చింది. ఏదైనా నచ్చకపోయినా లేదా మనవల్ల కాకపోయినా 'లేదు' అని చెప్పడం వల్ల మన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, అది మానసిక ప్రశాంతతకు ఎంతో మేలు చేస్తుందంటోంది. ఇదే విషయాన్ని సైకాలజిస్టులు కూడా చెబుతున్నారు. ప్రతిదానికీ 'అవును' అంటూ తలలూపడం వల్ల పని ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారని తెలిపింది.

# లవ్‌లో పడ్డ చిట్టి!



జాతిరత్నాలు సినిమాతో చిట్టీగా ఫేమస్ అయిపోయిన అమ్మడు ఫరియా అబ్దుల్లా. ఇటీవల గుర్రంపాపిరెడ్డి మూవీతో పాటు అనగనగా ఒక రాజులో ప్రత్యేక పాత్రలో మెరిసింది. కెరీర్ ప్రారంభంలో ఆమెను చూసిన వారందరూ కూడా ఉత్తరాది అమ్మాయి అనుకున్నారు. కానీ, ఆమె అచ్చమైన హైదరాబాదీ. పుట్టింది, పెరిగిందీ ఇక్కడే. ఫరియా అబ్దుల్లా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ గురించి ఓపెన్‌గా మాట్లాడింది. ప్రస్తుతం తాను ప్రేమలో ఉన్నానని తెలిపింది. తన ప్రియుడు ముస్లిం కాదని, హిందూ అంటోంది. అలా అని తన బాల్య స్నేహితుడు కాదని క్లారిటీ ఇచ్చింది. సినిమా ఇండస్ట్రీకి చెందిన వ్యక్తేనని క్లూ ఇవ్వడంతో పాటు అతను ఒక కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడని చెప్పింది. తాము ఇద్దరం కలిసి వర్క్ చేస్తూ ఒక టీమ్‌లా ముందుకు వెళ్తున్నట్లు మాట్లాడింది. కొంత కాలంగా తనలోని డ్యాన్స్, ర్యాప్‌లో వచ్చిన మార్పులకు అతనే కారణమని ఫరియా గుర్తుచేసుకుంది. తమ మధ్య ఉండే బంధం లవ్ అఫైర్ కాదని అదొక అనుబంధం అంటోందీ అమ్మడు. ఇంతకూ పెళ్లెప్పుడు చేసుకుంటుందో మరి.

# అది నా అదృష్టం





మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేస్తూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సినిమాలో మరో హీరో వెంకటేశ్ కూడా అతిథి పాత్రలో కనిపించి నవ్వులు పంచాడు. అయితే ఈ మూవీ విడుదలైన నాటి నుంచి వెంకీ భారీ మొత్తంలో రెమ్యూనరేషన్‌తీసుకున్నాడని సోషల్‌మీడియాలో వార్తలు వైరల్‌అవుతున్నాయి. తాజాగా ఈ విషయంపై నిర్మాత సుస్మిత కొణిదెల స్పందించారు. ఆయన పారితోషికం విషయంలో ఎలాంటి చర్చ జరగలేదని, తీసుకున్న రెమ్యూనరేషన్‌కు పూర్తి న్యాయం చేశారని చెప్పారు. వ్యక్తిగతంగా వెంకీ చాలా పాజిటివ్ గా ఉంటారన్న సుష్మిత.. ఆయనకు ఎంత ఇవ్వాలన్నా తమకు ఆనందమేనని తెలిపారు. భవిష్యత్తులో చిరు, వెంకీ మల్టీస్టారర్ వస్తే అందులో తాను భాగమైతే కచ్చితంగా అది తన అదృష్టంగా భావిస్తానని పేర్కొన్నారు.

# ఆసక్తికర కథాంశంతో 'కానిస్టేబుల్ కనకం: చాప్టర్ 3'.. ఈసారి థియేటర్స్‌లో..

సాధారణ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈటీవీ విన్‌లో వచ్చి ప్రేక్షకులను విశేషంగా అలరించిన వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' . వర్ష బొల్లమ్మ, మేఘ లేఖ, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. దానికి కొనసాగింపుగా ఇటీవల విడుదలైన 'సీజన్2' తొలి భాగాన్ని మించి ట్విస్ట్‌లతో మెప్పించింది. ఇప్పుడు ఈ రెండింటికీ మించి థ్రిల్ పంచడానికి మరోసారి సిద్ధమవుతోంది. అయితే, ఈసారి ఓటీటీలో మాత్రం కాదండోయ్. 'కానిస్టేబుల్ కనకం: కాల్ ఘాట్ చాప్టర్ 3' పేరుతో మూవీగా థియేటర్స్‌లో విడుదల కానుంది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం స్పెషల్ గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఈ విశాలమైన ప్రకృతిలో అడుగడుగునా భగవంతుడి ఆనవాళ్లు ఉంటాయి. వెతికే వాళ్లు చాలా మంది. కానీ, చూసేవాళ్లు కొంతమంది.. ఆమె అడుగు పడిన నేల మామూలు నేల కాదు. గుండె చప్పుడుని సైతం బంధించే నరరూప రాక్షసులు సంచరించే చోటు.. 'కాల్ ఘాట్'' అంటూ విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వెబ్‌సిరీస్‌కు మించి భారీ హంగులతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. పూరి జగన్నాథుడి నేపథ్యం కూడా సినిమాలో చేర్చారు. మరి ఈసారి కానిస్టేబుల్ కనకానికి ఎదురైన పరిస్థితులు ఏంటి? వాటిని ఆమె ఎలా పరిష్కరించారు? అన్నది సినిమాలో చూసి తెలుసుకోవాల్సిందే.




## 2026: ఉత్తమ చిత్రం కేటగిరిలో 10 చిత్రాలు.. ఆస్కార్ నామినేషన్స్ 2026 ఫుల్ లిస్ట్..




ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఆస్కార్స్ నామినేషన్స్ 2026' వెలువడ్డాయి. ఈ ఏడాది అవార్డుల కోసం పోటీ పడుతున్న చిత్రాల జాబితాను అకాడమీ ప్రకటించింది. 2025లో విడుదలై వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభను కనబరిచిన చిత్రాలు షార్ట్ లిస్ట్ అయి ఇప్పటికే అకాడమీ ముందుకు వచ్చాయి. వీటిలో విశేష ఆదరణ సొంతం చేసుకున్న చిత్రాలు, అందులోని నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసి అవార్డుల కోసం పోటీపడుతున్న వారి జాబితాను అకాడమీ ప్రకటించింది. ఉత్తమ చిత్రం కేటగిరిలో అత్యధికంగా 10 చిత్రాలు పోటీ పడుతుండటం విశేషం. రేయాన్ కూగ్లర్ దర్శకత్వంలో రూపొందిన 'సిన్నర్స్' అత్యధికంగా 16 కేటగిరిల్లో నామినేషన్స్ దక్కించుకుంది. ఇప్పటివరకూ 14 నామినేషన్స్‌తో 'ఆల్ అబౌట్ ఈవ్', 'టైటానిక్', 'లా లా ల్యాండ్ ' పేరిట ఈ రికార్డు ఉండేది. 'సిన్నర్స్' దానిని బద్దలు కొట్టింది. ఈ మూవీ తర్వాత 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'కు ఎక్కువ నామినేషన్స్ దక్కాయి. ఇక ఈ ఏడాది కొత్తగా క్యాస్టింగ్ డైరెక్టర్ కేటగిరిని అవార్డుల విభాగంలో చేర్చారు. 'సిన్నర్స్'లో నటనకు గానూ 73 ఏళ్ల డెల్రోయ్ లిండో తొలిసారి ఆస్కార్‌కు నామినేట్ అయ్యారు. ఈ నామినేషన్స్ ప్రకటన కార్యక్రమానికి నటుడు డానియల్ బ్రూక్స్, లూయిస్ పుల్‌మన్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. మార్చి 15వ తేదీన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

## మొన్న 'ధురంధర్'.. ఇప్పుడు 'బోర్డర్ 2'.. ఆ దేశాల్లో నిషేధం!



సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2'. జనవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈలోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది. గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్ పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్'. 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది 'బోర్డర్ 2'. సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## మేం వివాహం చేసుకున్నట్లే.. కానీ: ఆమిర్‌ఖాన్



తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్ తనతోనే కలిసే ఉంటున్నట్లు బాలీవుడ్ అగ్ర నటుడు ఆమిర్‌ఖాన్ తెలిపారు. గత కొన్ని నెలలుగా ఇండస్ట్రీలో జరిగే ఈవెంట్‌లకు వీరిద్దరూ కలిసి హాజరవుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పెళ్లి గురించి ప్రస్తావించారు. ''గౌరి, నేను ఒకరిపై ఒకరు గౌరవంతో ఉన్నాం. అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతున్నాం. మా దృష్టిలో వివాహం అంటే రెండు మనసుల కలయిక. ఈ రకంగా చూస్తే మేం వివాహం చేసుకున్నట్లే. ప్రస్తుతం మేం కలిసే ఉంటున్నాం. ఈ వివాహాన్ని మేం అధికారికం చేయాలా, వద్దా అనేది భవిష్యత్తులో నిర్ణయించుకుంటాం'' అని తెలిపారు.

# జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు అవగాహన సదస్సులు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 22: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు-2026ను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి, దోమకొండ మండలాల్లోని పలు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు జడ్ పి హెచ్ ఎస్ ఉప్పల్వాయి, జడ్ పి హెచ్ ఎస్ పోసానిపేట, జడ్ పి హెచ్ ఎస్ రామారెడ్డి, సోషల్ వెల్ఫేర్ పాఠశాల దోమకొండ మరియు జూనియర్ కళాశాల దోమకొండలో నిర్వహించబడ్డాయి. ఈ



సందర్భంగా సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు శ్రవణ్, ఇర్షాద్, శంకర్, రఫీ మరియు స్నిగ్ధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. పాదచారులుగా నడిచే సమయంలో, బస్సులు మరియు ఇతర వాహనాల్లో ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు సరళమైన భాషలో వివరించారు. అలాగే ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే బాధ్యతాయుతమైన అలవాటు అలవర్చుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సహాయం చేసే గుడ్ సమారిటన్‌లకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టపరమైన రక్షణలు, ప్రోత్సాహకాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. చిన్న వయసులోనే రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతులకు ఎన్ డి ఎ ప్రభుత్వం అండగా ఉంటుంది : బద్వేల్ ఎ ఎం సి చైర్మన్ సుప్రజ

పోరుమామిళ్ళ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 22: గోపవరం మండల ఎంపీపీ ,ఎంపీడీఓ తో కలిసి గోపవరం మండల సర్వ సభ్య సమావేశం లో పాల్గొని రైతులు , వ్యవసాయ సంబంధ విషయాల పైన , బద్వేల్ మార్కెట్ యార్డ్ లో నూతనంగా నిర్మితమైన రైతుబజార్ గురించి స్థానిక ప్రజా ప్రతినిధులతో, అధికారులతో చర్చించడం జరిగింది. రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని ,ప్రతి రైతు సేవ కేంద్రంలో కనీస మద్దతు ధర పట్టిక ఏర్పాటు చేయడం జరిగింది అని ప్రతి రైతు పంట నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలనీ తెలపడం జరిగింది . ఈ కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు , ప్రజలు పాల్గొన్నారు .




## నాల్గవ రోజు ఇండియా సైన్స్ ఫేయిర్ విజయవంతం

* **ఆకట్టుకున్న సృజనాత్మక సైన్స్ ప్రాజెక్టులు**

సంగారెడ్డి, జనవరి 22 (భారత శక్తి ప్రతినిధి): కొల్లూరు క్యాంపస్‌లోని గాడియం స్కూల్‌లో నిర్వహించబడుతున్న సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్ నాలుగో రోజు కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సందర్శకుల ఉత్సాహభరితముగ పాల్గొని విజయవంతంగా కొనసాగింది.2026 నాలుగో రోజులో విద్యార్థులు తమ సృజనాత్మక సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడంతో విస్తృత ప్రజా ఆకర్షణ పొందింది. సందర్శక విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ప్రదర్శనలను గమనించి, విశ్లేషించి, వాటి నుంచి నేర్చుకునేందుకు ఆసక్తి చూపించారు. విద్యార్థులు సృజనాత్మక ప్రశ్నలు అడగడంలో ముందుండి, ఇచ్చిన వివరణలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆసక్తి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసింది. ఈ సైన్స్ ఫెయిర్‌లో మహిళల రక్షణ జాకెట్, బొటనవేలు ముద్రతో ఓటింగ్ విధానం, స్మార్ట్ వ్యవసాయం వంటి ఉత్సాహభరిత అంశాలతో కూడిన అద్భుతమైన ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. ఎన్‌జీఓలు ఏర్పాటు చేసిన స్టాళ్లు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆకుల కళ (లీఫ్ ఆర్ట్), జన విజ్ఞాన వేదిక సభ్యుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే ప్రదర్శనలు ఇందులో భాగంగా ఉన్నాయి. "హోప్ ఎమర్జెన్సీ అలారం" అనే అత్యంత ఉపయోగకరమైన ప్రాజెక్ట్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సెంట్ పీటర్స్ స్కూల్‌కు చెందిన ప్రశస్తి మాట్లాడుతూ, "హోప్ ఎమర్జెన్సీ అలారం" ప్రాజెక్ట్ తనకు చాలా నచ్చిందని తెలిపింది. ఒంటరిగా నివసించే వ్యక్తులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, ఎవరికైనా నేలపై పడిపోయినప్పుడు ఇది ఆటోమేటిక్‌గా పోలీసులకు అలారం పంపుతుందని వివరించింది. ఈ ప్రదర్శనలు శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత మరియు సమస్యల పరిష్కార నైపుణ్యాలపై బలమైన దృష్టిని ప్రతిబింబించాయి. వాస్తవ జీవన సవాళ్లకు పరిష్కారాలను చూపించే భావనలు ఇందులో ప్రధానంగా కనిపించాయి.2026 నాలుగో రోజు కూడా ప్రశంసనీయమైన స్పందనతో ముగిసింది. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు ఆరు జిల్లాల నుంచి సుమారు 11,000 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ విధంగా విద్యార్థుల ఊహాశక్తిని పెంపొందిస్తూ, అద్భుతమైన ప్రాజెక్టుల ద్వారా అనుభవాత్మక అభ్యాసాన్ని మరింత బలపరిచింది.



## డి. ఆర్. ఓ, వై.వి గణేష్ ను సత్కరించిన టి. జి. ఓ. లు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జనవరి 22: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున గురువారం డిఆర్ఓ వైవి గణేష్ కన్ఫర్డ్ ఐఏఎస్ క్యాడర్ కు ఎంపిక అయిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్మోహన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సహాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కోల రాజేష్ కుమార్, సంజీవరెడ్డి, నవీన్ కుమార్, చంద్రశేఖర్, నర్సింహస్వామి, బాలరాజు, అన్వర్ హుస్సేన్, చంద్రశేఖర్, ఈశ్వర ప్రసాద్, మహేందర్, మాధవరెడ్డి, తదితరు లు హాజరు అయ్యారు.

# నిద్ర లేకపోయినా.. నీరసించిపోకుండా!

**నిద్ర శరీరాన్ని రీఛార్జ్ చేస్తుంది. అందుకే రాత్రంతా సుఖంగా, హాయిగా నిద్ర పడితేనే మరుసటి రోజు ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతాం. కానీ కొన్నిసార్లు రాత్రి నిద్ర పట్టకపోవచ్చు.. కొన్ని అత్యవసర పనుల వల్ల నిద్రను త్యాగం చేయాల్సి రావచ్చు. ఇలా రాత్రంతా నిద్ర లేకపోవడం వల్ల మరుసటి రోజు నీరసించిపోతుంటాం. కానీ ఇలా జరగకుండా కొన్ని చిట్కాలు ఉపకరిస్తాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**



### బ్రేక్‌ఫాస్ట్‌లో..

రోజులో మనం తీసుకొనే తొలి ఆహారం బ్రేక్‌ఫాస్ట్. ఇది రోజంతటికీ కావాల్సిన శక్తిని, ఉత్సాహాన్నీ అందిస్తుంది.ముందు రోజు రాత్రి నిద్ర లేకపోయినా.. ఆ అలసటను దూరం చేసుకునేలా పోషకాలున్న అల్పాహారం తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఓట్‌మీల్, పండ్లు, నట్స్, సలాడ్స్.. వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తి వస్తుందంటున్నారు. తద్వారా మధ్యాహ్న భోజనం వరకు అలసట దరిచేరకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే తీసుకునే ఆహారంలో చక్కెరలు, కెఫీన్ వంటివి లేకుండా చూసుకోవాలి.


### విరామం తీసుకోండి!

రాత్రంతా నిద్ర లేకుండా మరుసటి రోజు ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లడం, ఇతర పనుల్ని పూర్తిచేయడమంటే చిరాకే! అలాగని వాటిని పక్కన పెట్టలేం. కాబట్టి ముందు రోజు నిద్రలేమి ఆయా పనులపై పడకూడదంటే.. మధ్యమధ్యలో కాసేపు విరామం తీసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పచ్చటి మొక్కల మధ్య కాసేపు నడవడం, నచ్చిన పాట వినడం, నచ్చిన వారితో మాట్లాడడం, శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయడం.. ఇలాంటి పనుల వల్ల శరీరం పునరుత్తేజితమవుతుంది. అలాగే ఏకాగ్రత పెరుగుతుంది. ఇది పనిపై తిరిగి పూర్తి దృష్టి పెట్టేందుకు దోహదం చేస్తుందంటున్నారు నిపుణులు.



### తగినన్ని నీళ్లు

నిద్రలేమి అలసటను దూరం చేసుకోవాలంటే శరీరంలో తగినంత నీటి శాతం ఉండేలా జాగ్రత్తపడడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో రోజంతా సరిపడా నీళ్లు తీసుకోవాలని చెబుతున్నారు. నీళ్లతో పాటు పండ్ల రసాలు, హెర్బల్ టీలు, పండ్ల ముక్కలు/కాయగూర ముక్కలు/మూలికలు వేసి తయారుచేసిన ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్.. వంటివి తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేట్ అవుతుంది.. అలాగే వాటిలోని పోషకాలూ శరీరానికి అందుతాయి. ఫలితంగా తక్షణ శక్తి వస్తుంది.



### ఒత్తిడికి దూరంగా..!

ముందు రోజు రాత్రి నిద్రలేమి మరుసటి రోజు ఒత్తిడికి కారణమవుతుంటుంది. దీనివల్ల అలసట, నీరసమే కాదు.. అలర్ట్‌నెస్‌ని కూడా కోల్పోతుంటాం. ఇలా జరగకూడదంటే ఒత్తిడిని దూరం చేసుకొనే మార్గాల్ని అన్వేషించాలి. ఇందుకు ఉదయాన్నే కొద్దిసేపు యోగా, ధ్యానం.. వంటివి సాధన చేయాలి. వీటివల్ల శరీరానికి వ్యాయామం అందడమే కాదు.. నాడీ వ్యవస్థపై సానుకూల ప్రభావం పడుతుంది. తద్వారా నాడులు రిలాక్సై.. ఒత్తిడి దూరమవుతుంది. అలాగే వీలైతే మధ్యాహ్న సమయంలో 1020 నిమిషాల పాటు కునుకు తీయడం కూడా మంచిదే అంటున్నారు నిపుణులు!

# ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా




* **'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ అమలు కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి) జనవరి 22: తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యం లో తెలంగాణ రాష్ట్ర గనులు అండ్ భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎండిసి) అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయితీ సెక్రటరీలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయితీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏడి మైనింగ్ అధికారులు, పిఓ టిజిఎండిసి, సీజీజీ (హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడివోలు, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వసంత పంచమి నాడు జ్ఞాన కాంతులను పంచుతూ జ్ఞాన్ పోస్ట్

విజయవాడ, జనవరి 22 (భారత శక్తి ప్రతినిధి): జ్ఞానానికి, వివేకానికి ప్రతీక అయిన వసంత పంచమి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా.చంద్ర శేఖర్ పెమ్మసాని ప్రేరణతో తపాలా శాఖ 4 మరియు 5వ తరగతి చదువుతున్న బడుగు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసే ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని వసంత పంచమి నాడు (నేడు) ఫిలాటలీ బ్యూరో, విజయవాడ జి.పి.ఒ. కాళేశ్వర రావు మార్కెట్, విజయవాడ వద్ద నిర్వహించుచున్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులలో పిలాటలీ (తపాలా బిళ్ళల సేకరణ) పై శాశ్వత ఆసక్తిని పెంపొందించడం మరియు ఆరోగ్యకరమైన పఠన అలవాట్లను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. నీతి కథలు మరియు తపాలా బిళ్ళల సేకరణ కళను మేళవించి, వయసుకి తగిన పుస్తకాలను అందించడం ద్వారా, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలలో ఆసక్తిని మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలని తపాలా శాఖ ఆశిస్తోంది. ప్రతి పుస్తకంతో పాటు గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి ప్రేరణాత్మక సందేశాన్ని కలిగి ఉన్న పోస్ట్కార్డ్ ఉంటుంది. జ్ఞాన్ పోస్ట్ అనేది ఇండియా పోస్ట్ అందించే తక్కువ ఖర్చుతో కూడిన పోస్టల్ సేవ. దీని ద్వారా విద్యా, సాంస్కృతిక, సామాజిక మరియు ధార్మిక పుస్తకాలను తక్కువ ధరలకు పంపవచ్చు. ఈ సేవ గురుంచి విద్యార్థుల లో ప్రత్యేక అవగాహను ను తీసుకు రావడము కోసము తపాల శాఖ ఈ కార్యక్రమము ను నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమము లో ఎమ్.నరసింహ స్వామి , సీనియర్ సూపరింటెండెంట్ ఆప్ పోస్టాఫీసెస్, విజయవాడ డివిజన్, విజయవాడ మరియు జి. కరుణాకర బాబు , సీనియర్ పోస్ట్ మాస్టర్, విజయవాడ జి.పి.ఒ, విజయవాడ తదితరులు పాల్గొంటారు.

## రాధిక హైస్కూల్లో వీ ప్లే, వి విన్ అనే నినాదంతో మొదలైన వార్షిక క్రీడలు



మణుగూరు, జనవరి 22 (భారతశక్తి): మండల పరిధిలోని సమితిసింగారం పంచాయితీ, రాజీవ్ గాంధీ నగర్ లో గల రాధికా కాన్సెప్ట్ హైస్కూల్లో వీ ప్లే వి విన్ అనే నినాదంతో గురువారం పాఠశాల యాజమాన్యం వార్షిక క్రీడలను ప్రారంభించారు. క్రీడలు ఈ నెల 22, 23, 24, తేదీలలో జరుగుతాయని స్కూల్ యాజమాన్యం తెలిపారు. మణుగూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పాటి నాగబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడలు అనేవి విద్యార్థిని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కీలక పాత్ర పోషిస్తాయని, ఆటల ద్వారా, శారీరిక, మానసిక, క్రమశిక్షణతో కూడిన జీవితం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల ఐక్యతని, ఏకాగ్రతని, సృజనాత్మకమైన నైపుణ్యాలు మెరుగుపరుస్తాయని తెలుపుతూ విద్యార్థినీ, విద్యార్థుల్లో క్రీడా ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం నరేష్ మాట్లాడుతూ ప్రత్యేకంగా మణుగూరు నుంచి తమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్ర క్రీడల్లో సైతం రాణిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో ఎంతోమంది తమ పాఠశాల నుండి రాష్ట్ర క్రీడలకు ప్రాతినిధ్యం వహించాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాస్థాయిలో ఆటల ద్వారా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐ కి పాఠశాల మార్చ్ పాస్ట్ స్టూడెంట్స్ గౌరవ వందనం చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్, సిహెచ్ జైసింహారెడ్డి, జి సంపత్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, నూకారపు రమేష్, ఇన్చార్జి మేడం ఉషా, కీర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేందర్, చంద్రకళ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## దివ్యాంగుల ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

సంగారెడ్డి, జనవరి 22 (భారతశక్తి ప్రతినిధి): దివ్యాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం క్యాలెండర్ ను గురువారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆవిష్కరించారు.దివ్యాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం క్యాలెండరు ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ చే ఆవిష్కరించినట్టు దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బసవరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విశాలాక్షి , సదాశివపేట మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ మొహ్సిన్, మధుసూదన్ పాల్గొన్నారు.

## ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

* **'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ అమలు కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి) జనవరి 22: తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యం లో తెలంగాణ రాష్ట్ర గనులు అండ్ భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎండిసి) అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయితీ సెక్రటరీలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయితీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏడి మైనింగ్ అధికారులు, పిఓ టిజిఎండిసి, సీజీజీ (హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడివోలు, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బైపాస్ రోడ్ విస్తరణ పనులు ప్రారంభం

* **విస్తరణ పనుల జాప్యం పై - హెచ్ ఎం డి ఏ అధికారుల పై నిర్మల జగ్గారెడ్డి ఆగ్రహం**

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 22: సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనుల్లో జాప్యం పై హెచ్ ఎం డి ఏ అధికారులపై జగ్గారెడ్డి, నిర్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం నుండే అధికారులు ఆగ మేఘాలపై పనులు ప్రారంభించారు. ఐబి ప్రహారీ గోడను జేసిబిల సహాయంతో కూల్చి వేశారు. రోడ్ కు అడ్డంగా ఉన్న చెట్లను నరికి వేసి రోడ్ వెడల్పు పనులు ప్రారంభించారు. పనులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ఐబి గెస్ట్ హౌస్ నుండి సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. విస్తరణ పనులు వేగవంతం కావడం పై పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. విస్తరణ పనులు పూర్తయితే ఐబి గెస్ట్ హౌస్ నుండి మొదలుకొని బస్వేశ్వర విగ్రహం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పట్టణ వాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్ లు ఐబి వద్ద పనులను పర్యవేక్షించారు.

## తక్షణమే జీవో నెంబర్ 98 రద్దు చేయాలి

* **మున్నేరు ప్రాజెక్టును నిర్మించి సాగునీరు, త్రాగునీరు అందించాలి**
* **ప్రజా అభిప్రాయం లేకుండానే మున్నేరు,లింకు కెనాల్**
* **1076 జీవో ప్రకారమే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 22 (భారత శక్తి): మున్నే రు పాలేరు లింకు కాలువను నిలిపివేసి జీవో 98ను రద్దు పరచాలని జీవో 1076 ప్రకారమే మున్నేరు ప్రాజెక్టును నిర్మించాలని, అదేవిధంగా సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్ 1 పనులను వెంటనే చేపట్టి గార్ల బయ్యారం మండలాలతో సహా ఏజెన్సీ ప్రాంతాలకు సాగు త్రాగునీరు అందించాలని జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మున్నేరు జలసాధన కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్నేరు జలసాధన కమిటీ గార్ల సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని మున్నేరు ప్రాజెక్టు నిర్మిస్తే ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాలోని గార్ల కామేపల్లి కారేపల్లి డోర్నకల్ మండలాలకు సాగునీటితో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని, ఈ ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల నెరవేరుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మున్నేరు నీటిని గార్ల మండలం నుంచి సీతారామ ప్రాజెక్టు కాలవ ద్వారా పాలేరు చెరువుకు తరలిస్తున్నారు. నెంబరు 98 విడుదల చేస్తూ కాలువ నిర్మాణం పనుల కోసం 162 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఈ జీవోను రద్దు చేయాలని ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాల ముగ్గురు మంత్రులకు వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా జీవో 98 ను రద్దు చేసి సీతారామ ప్రాజెక్టు పేస్ పనులను పూర్తి చేసి గార్ల బయ్యారం మండలాలతో సహా ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలోగౌని ఐలయ్య, జంపాల విశ్వ, గంగావత్ లక్ష్మణ్, కందునూరి శ్రీనివాస్, జెండా సత్యనారాయణ, గుగులోత్ సక్రు, కట్టె బోయిన శ్రీనివాస్, గిన్నారపు మురళి, కత్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 2035 నాటికి ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్'గా గుర్తింపే లక్ష్యం: దావోస్‌లో మంత్రి నారా లోకేశ్

అమరావతి, జనవరి 22 (భారతశక్తి): ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పారిశ్రామిక విధానంలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేస్తున్నామని, పెట్టుబడులను వారాల వ్యవధిలోనే కార్యరూపంలోకి తెచ్చేలా 2035 నాటికి రాష్ట్రాన్ని 'డేజీరో రెడీ స్టేట్'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నమ్మకం, వేగం అనే రెండు అంశాలు ఏపీని కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన 'ద ఫాస్ట్ లేన్: ఇన్వెస్టింగ్ ఎట్ ది స్పీడ్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సమయం ఆదా చేయడమే అతిపెద్ద లాభం. ఇదే రాష్ట్రానికి ఆర్థిక పోటీలో ఆధిక్యతను ఇస్తోంది. దీనికోసం రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (SIPB) ప్రతినెలా సమావేశమై ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, అంతర్గత సమస్యలను పరిష్కరిస్తోంది. భూమి, యుటిలిటీస్, పర్యావరణ అనుమతుల వంటి అంశాల్లో వరుస అనుమతులకు బదులుగా ప్యారలల్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులు ప్రారంభించే సమయాన్ని గణనీయంగా తగ్గించాం" అని వివరించారు.

**'డే-జీరో రెడీ స్టేట్' అంటే...!**

2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 'డేజీరో రెడీ స్టేట్'గా గుర్తింపు పొందేలా చేయడమే తమ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అంటే, పెట్టుబడి నిర్ణయం తీసుకున్న కొన్ని వారాల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారం కాకుండా, పటిష్టమైన వ్యవస్థ ఆధారంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. రియల్ టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్ ద్వారా జాప్యాన్ని ముందుగానే గుర్తించి, అవరోధాలను తొలగిస్తున్నామని వివరించారు.

**నిబంధనల సరళీకరణ**

పరిపాలనలో వేగాన్ని పెంచేందుకు డీరెగ్యులేషన్ డ్రైవ్‌లో భాగంగా గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నాలా చట్టాన్ని రద్దు చేశామని, డీక్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. తాము రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తున్నామని, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇస్తూ, అధిక ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇది సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

**ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి**

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని కొన్ని నగరాలకే పరిమితం చేయకుండా, అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్కును స్థానిక వనరుల ఆధారంగా, అగ్రో ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇది వలసలను తగ్గించడంతో పాటు, పెద్ద పరిశ్రమలకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఏపీ ప్రత్యేకత అని లోకేశ్ అన్నారు. విధానాల స్థిరత్వం, సంస్థల విశ్వసనీయతతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నమ్మకం, వేగం రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పోటీ వాతావరణంలో ఒక ప్రత్యేక పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెర్నీ సీనియర్ పార్టనర్ సుకేతు గాంధీ, గూగుల్ ఏసియా పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కాగ్నిజెంట్ గ్లోబల్ సీఎఫ్ఓ జతిన్ దలాల్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

## దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ...
# రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

దావోస్, జనవరి 22 :స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు. అలాగే, కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్క సారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్...
# తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 22 (భారతశక్తి):తెలంగాణ గ్రూప్1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC), ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

దావోస్, జనవరి 22:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తన నాలుగు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి బయల్దేరారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న ఆయన, శుక్రవారం ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా అమరావతికి పయనమై, ఉదయం 11:30 గంటల నుంచి సచివాలయంలో అధికారిక విధుల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ఫలవంతంగా సాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కేవలం మూడు రోజుల సమావేశాల ద్వారానే గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), వ్యవసాయం, టూరిజం వంటి కీలక రంగాల్లో సుమారు రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని ఆయన వివరించారు. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ప్రగతిని, అందుబాటులో ఉన్న వనరులను ప్రపంచ వేదికపై సమర్థంగా వివరించగలిగామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పుడు భారత్ వైపు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, దేశంలోని యువశక్తి, సమర్థ నాయకత్వం, సానుకూల పాలసీలే ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు. తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మొత్తం 36కు పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ వంటి 16 మందికి పైగా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన 9కి పైగా సెషన్లలో పాల్గొని, ప్రపంచ పారిశ్రామిక రంగంలోని తాజా పోకడలను, పారిశ్రామికవేత్తల ఆలోచనలను తెలుసుకున్నారు. ఈ సదస్సు 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌'ను ప్రపంచానికి మరింత చేరువ చేసేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను అంచనా వేసేందుకు ఎంతగానో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా యూరప్‌లోని తెలుగు ప్రజలతోనూ చంద్రబాబు మమేకమయ్యారు. తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. దావోస్ వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

## లోయలో పడిన ఆర్మీ వాహనం..
# 10 మంది సైనికులు మృతి

జమ్మూకశ్మీర్, జనవరి 22 (భారతశక్తి):జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబాబందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

# కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

కర్ణాటక, జనవరి 22 (భారతశక్తి):కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు. దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్‌కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది. దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు. అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు

మేడారం, జనవరి 22 (భారతశక్తి):తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు ఇవాళ్టి నుంచి ప్రారంభమయ్యాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35,999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది. ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం 'జాయ్ రైడ్స్' నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.

## మస్క్ తొలగించినా డీలాపడలేదు..
# వేల కోట్ల కంపెనీకి అధిపతిగా పరాగ్!

జనవరి 22 (భారతశక్తి):'ఎక్స్' (ట్విట్టర్) మాజీ సీఈఓ పరాగ్ అగర్వాల్ పేరు చెప్పగానే, ఎలాన్ మస్క్ ఆయన్ను పదవి నుంచి తొలగించిన ఘటనే గుర్తుకొస్తుంది. కానీ, సరిగ్గా రెండేళ్ల తర్వాత పరాగ్ టెక్ ప్రపంచంలోకి ఘనంగా పునరాగమనం చేశారు. ఆయన స్థాపించిన 'పారలెల్ వెబ్ సిస్టమ్స్' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఇప్పుడు ఏకంగా రూ. 6,000 కోట్లకు పైగా విలువతో సంచలనం సృష్టిస్తోంది. 2022 అక్టోబరులో ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న వెంటనే పరాగ్‌ను సీఈఓ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఫేక్ అకౌంట్ల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మస్క్ ఆయన్ను అవమానకరంగా ఆఫీసు నుంచి బయటకు పంపించడంతో అప్పట్లో ఇది పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల పాటు పరాగ్ అగర్వాల్ పెద్దగా వార్తల్లో కనిపించలేదు. అయితే, ఈ విరామంలో ఆయన తన పాత మిత్రులతో కలిసి ఒక కొత్త ఏఐ స్టార్టప్‌ను ప్రారంభించారు. డెవలపర్స్ కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థను నిర్మించారు. పరాగ్ ప్రతిభపై నమ్మకంతో ఖోస్లా వెంచర్స్ వంటి ప్రముఖ సంస్థలు సుమారు రూ. 250 కోట్ల ప్రారంభ పెట్టుబడిని అందించాయి. ముంబై ఐఐటీలో చదువుకున్న పరాగ్ అగర్వాల్, 2011లో సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ట్విట్టర్‌లో చేరారు. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతూ 2021లో కంపెనీకి సీఈఓ అయ్యారు. ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా, తన నైపుణ్యంతోనే తిరిగి సమాధానం చెప్పారు. మస్క్ ఆయనను ఉద్యోగం నుంచి తొలగించగలిగినా, ఆయనలోని ప్రతిభను మాత్రం ఆపలేకపోయారని ఈ విజయం నిరూపిస్తోంది.

# మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా?: కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 22 (భారతశక్తి): కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "సీఎం బావమరిది బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు బయటపెట్టారు. ఉదయం కుంభకోణం బయటపెడితే సాయంత్రానికి నోటీసులు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సిట్ అంటే... సిట్, స్టాండ్. సిట్ విచారణ సీరియల్ లా మారింది. ఆర్‌ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం సిట్ ఉండదు. ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదు.. అసమర్థ పాలన. మేము ఏ తప్పూ చేయలేదు.. ఎవరికీ భయపడేది లేదు. కేవలం రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతా. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధంలేని నేతలను ప్రశ్నించారు. సిట్ అధికారులను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతా. నా ఫోన్ ట్యాప్ అవుతుందా? అని సిట్ అధికారులను అడుగుతా. ఫోన్ ట్యాపింగ్ ప్రభుత్వాలు చేయవు.. పోలీసు వ్యవస్థ చేస్తుంది. శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి వంటి అధికారులను ప్రశ్నించట్లేదు. మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెబితే ఖండించలేదు'' అని కేటీఆర్ అన్నారు.

# మేడారం రక్షణే ధ్యేయం.. 22 భాషల నినాదాలతో వినూత్న ర్యాలీ

* **హనుమకొండ కలెక్టరేట్ వద్ద అవగాహన కార్యక్రమం**
 **: పాల్గొన్న అదనపు కలెక్టర్ ఎన్. రవి.**

హనుమకొండ సంస్కృతి, జనవరి 22: (భారత శక్తి) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర పవిత్రతను కాపాడాలని, అడవిని ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని ప్రపంచ పర్యావరణ సంస్థ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట 22 రాజ్యాంగ గుర్తింపు పొందిన భాషలతో రూపొందించిన భారీ వస్త్ర బ్యానర్‌తో వినూత్న అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.





**ప్లాస్టిక్ రహిత జాతరే లక్ష్యం**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మేడారం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను కాలుష్య రహితంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుందని, పర్యావరణ హితమైన వస్త్ర బ్యానర్లతో అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే జాతరలో భక్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడనాడాలని కోరారు.

**అడవి తల్లిని కాపాడుకుందాం:**

సామాజికవేత్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ఈసారి జాతరకు సుమారు 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించకపోతే కోట్ల సంఖ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలు అడవిలో పేరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భక్తులు అడవి తల్లిని, వన్యప్రాణులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

**అంతర్జాతీయ గుర్తింపు కోసం కృషి:**

ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్. భద్ర మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా మేడారంలో ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి జాతరకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 22 భాషల్లో నినాదాలు రూపొందించినట్లు చెప్పారు.

**హోరెత్తిన నినాదాలు:**

ర్యాలీలో పాల్గొన్న కాకతీయ పాఠశాల విద్యార్థులు "పరిశుభ్ర మేడారం హరిత మేడారం" అంటూ చేసిన నినాదాలు పరిసరాలను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్, కాజీపేట ట్రాఫిక్ (ఇన్‌స్పెక్టర్) పిట్టల వెంకన్న, శ్రీనివాస్ పటేల్, సుమెర్, ఏనుగుల రాంప్రసాద్, దయాప్రసాద్, నీలం యువరాజ్, రోషన్ గైక్వాడ్, బాగడి రమేష్, అనికేత్, బాల ప్రతినిధి అద్విత్ తదితరులు పాల్గొన్నారు.



## కాలనీలో కార్పొరేటర్ మార్నింగ్ వాక్
# సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన

ఎల్బీనగర్, జనవరి 22 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గురువారం ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలోని పలు ప్రాంతాలను సందర్శించి, అక్కడి నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కాలనీవాసుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడతామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, గడ్డిఅన్నారం డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మల్‌రెడ్డి రాంరెడ్డి

* **బాధితుడికి రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

చైతన్యపురి, జనవరి 22 (భారత శక్తి) : రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం హిల్స్ కాలనీకి చెందిన బొమ్మ శివకుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) నుంచి మంజూరైన రూ. 60,000 చెక్కును గురువారం ఆయన చైతన్యపురిలోని కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు.



**అర్హులందరికీ ప్రభుత్వ భరోసా**

ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు వేగంగా ప్రజల్లోకి వెళ్తున్నాయని పేర్కొన్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధ పడుతూ చికిత్స తీసుకోలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఒక వరంలా మారిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సాయాన్ని పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకున్నందుకు శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. సాయం మంజూరు చేయించిన మల్‌రెడ్డి రాంరెడ్డికి, ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భాస్కరా చారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బబ్బూరి ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## అరైవ్ అలైవ్ ప్రోగ్రాం నిర్వహించిన
# ట్రాఫిక్ పోలీసులు

ఎల్బీనగర్, జనవరి 22 (భారత శక్తి): వనస్థలిపురం రైతు బజార్ వద్ద ప్రజలకు, వ్యాపారాలు చేసే వారికి ట్రాఫిక్ అధికారులు అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ పెట్టుకుని ద్విచక్ర వాహనం, సీట్ బెల్ట్ పెట్టుకొని కారు లాంటి వాహనం నడపాలని, స్పీడ్ లిమిట్స్ దాటకుండా డ్రైవింగ్ చేయాలనీ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్స్ ఫాలో కావాలని, జీబ్రా లైన్స్ లో నడిచేలా పాదచారులకు అవకాశం ఇవ్వాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ అపాయమని, వెహికల్స్ ఫిట్ నెస్ తో ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ విభాగం ఏసీపీ నవీన్ రెడ్డి, సీఐలు గట్టు మల్లు, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ వీర స్వామి, రైతు బజార్ అధికారిణి స్వప్న బలరాం, వనస్థలిపురం ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు మోక్షం
# రూ. 53 లక్షలతో డ్రైనేజీ పనుల ప్రారంభం

* **ప్రజల ఇబ్బందులు తీర్చడమే లక్ష్యం: కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**

బి.ఎన్. రెడ్డి నగర్, జనవరి 22 (భరతశక్తి) : బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బి.ఎన్. రెడ్డి నగర్ ఫేస్1 కాలనీలో రూ. 53 లక్షల వ్యయంతో మంజూరైన స్ట్రామ్ వాటర్ డ్రైన్ (తుపాను నీటి కాలువ) అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ డ్రైనేజీ పనులను చేపట్టినట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ, కాలనీలోని ప్రతి సమస్యనూ విడతల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. అధికారులు, కాలనీ ప్రతినిధుల సమక్షంలో.. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నాగేందర్ గౌడ్, డీఈ కనకయ్య, ఏఈ మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి, హరిహరపురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొని అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రాములు, ధనరాజ్, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, సహ కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఈసీ సభ్యులు ప్రభాకర్, అజయ్ యలమంచి, కాశిరెడ్డి జంబుల, హరిగోపాల్, రామచంద్రమూర్తి, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. వీరితో పాటు ప్రసాద్, మాల్రెడ్డి రామ్ రెడ్డి, పురం నర్సింహారెడ్డి, అమర్ నాథ్, బిక్షపతి, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# 3.560 కేజీల గంజాయి పట్టుకున్న డిటీఎఫ్ టీం

* **ముగ్గురిపై కేసు నమోదు..ఇద్దరి అరెస్ట్**

ఎల్బీనగర్, జనవరి 22 (భారత శక్తి): సరూర్‌నగర్ డీటీఎఫ్ టీమ్ గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు డీటీఎఫ్ సీఐ టి.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో బృందం సభ్యులు దాడులు నిర్వహించారు.ఈ దాడులలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద 3.560 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రావుల శ్రీనివాస్, సూర్యవంశీ సిద్ధార్థలను అరెస్టు చేశారు. మరో నిందితుడు దినేష్ సింగ్ పై సైతం కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణరావు తెలిపారు. నిందితులను, గంజాయిని మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ బి. శంకర్, కానిస్టేబుల్స్ రవికాంత్, రాజీవ్ రెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.



# గంజాయి సరఫరా కేసులో నలుగురిని అరెస్ట్ చేసిన డిటీఎఫ్ టీం

ఎల్బీనగర్, జనవరి 22 (భారత శక్తి): మీర్ పేట్ స్టేషన్ పరిధిలో గల బాలాపూర్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మీర్పేట్ అధికారులు ఒక కేసులో (1.2) కేజీల గంజాయి పట్టుకోవడం జరిగింది. ఇందులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు. ఈ కేసులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఎస్సై ఫయాజ్, సామజ, కృష్ణయ్య గౌడ్ ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా, టికేఆర్ కాలేజ్ బస్ స్టాప్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీటీఎఫ్ సరూర్నగర్ అధికారులు ఒక గంజాయి కేసును పట్టుకున్నారు.ఈ కేసులో 3.75 కేజీల గంజాయి పట్టుకోవడం జరిగింది.ఇందులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీటీఎఫ్ సరూర్నగర్ ఇన్స్పెక్టర్ టీ. సత్యనారాయణ, బీ.శంకర్, ఎస్ఐ ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.